SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 290 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 28, జూన్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

## వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

**వ్యవసాయ, అనుబంధ రంగాల స్థూల ఉత్పత్తి విలువలో 11వ స్థానం**

- రాష్ట్రంలో తగ్గిన కూరగాయల సాగు
- పప్పు దినుసులు, పసుపు, మామిడిలోనూ తగ్గుదల
- కేంద్ర గణాంకశాఖ నివేదిక



**జూన్ 27, సమయం న్యూస్, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాల స్థూలఉత్పత్తి విలువలో తెలంగాణ 11వ స్థానంలో నిలిచింది. అన్నిరకాల ధాన్యాల ఉత్పత్తి విలువలో నాలుగో స్థానంలో నిలవగా.. వరి ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచింది. చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనెగింజలు, పండ్లు, కూరగాయలు, పశుసంపదలో ఇప్పటికీ వెనుకబడి ఉంది. 13 ఏళ్లలో వరిలో 3 రెట్ల వృద్ధి నమోదు చేసింది. అయితే అన్ని రకాల ధాన్యాల ఉత్పత్తిలో ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్,

తరువాయి 2లో



## చరిత్రను మలుపు తిప్పిన నేత పీవీ

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- రాజ్‌భవన్‌లో మాజీ ప్రధాని చిత్రపటం ఆవిష్కరణ

**జూన్ 27, సమయం న్యూస్, హైదరాబాద్:** భారతదేశ ఆధునిక చరిత్రను విప్లవాత్మక రీతిలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు మలుపు తిప్పారని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. పీవీ జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో శుక్రవారం మాజీ ప్రధాని చిత్రపటాన్ని గవర్నర్ ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. దేశంలో ఆర్థిక సరళీకరణను

తరువాయి 2లో

## మహిళా 'శక్తి' క్యాంటీన్లు



- కలెక్టరేట్లు, ఆసుపత్రులు, బస్టాండ్లలో 150కి పైగా ఏర్పాటు
- ఒక్కోచోట ఐదు నుంచి ఏడుగురు మహిళలకు ఉపాధి
- రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నడుస్తూ ఆర్థికాభివృద్ధికి ఊతం

**జూన్ 27, సమయం న్యూస్:** వరంగల్, సిరిసిల్ల, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, సూర్యాపేట, మహబూబాబాద్: రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'ఇందిరా మహిళా శక్తి' క్యాంటీన్లను స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలోని కొత్త కలెక్టరేట్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, బస్టాండ్లు, పారిశ్రామిక ప్రాంతాల్లో వీటిని నిర్వహిస్తూ సంఘాల మహిళలు ఆర్థిక పురోభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో గత ఏడాది 'ఇందిరా మహిళా శక్తి' పథకానికి తెలంగాణ సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కేరళ, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అమలవుతున్న క్యాంటీన్లను అధ్యయనంచేసి, ఇక్కడా వాటి ఏర్పాటుకు సంకల్పించింది.

తరువాయి 2లో

## మూడు విడతల్లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

- నేటి నుంచి ప్రారంభం
- జులై 1 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 6 నుంచి వెబ్ ఆప్షన్లు
- షెడ్యూల్ ఖరారు

**జూన్ 27, సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మూడు విడతల్లో జరగనుంది. ఆగస్టు 18 నుంచి కళాశాలల్లో బ్రాంచీలు మార్చుకునే స్లైడింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

తరువాయి 2లో



## ద్విచక్ర వాహనంతో 2 హెల్మెట్లు తప్పనిసరి

- తయారీదారులకు కేంద్రం షరతు
- ముసాయిదా నిబంధనలు విడుదల
- త్రిచక్ర వాహనాలకు యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టం

జూన్ 27, సమయం న్యూస్, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు 2025కి రెండు ముఖ్య సవరణలు ప్రతిపాదిస్తూ ముసాయిదా విడుదల చేసింది. ఈ నిబంధనలు అమల్లోకి వచ్చిన మూడోనెల నుంచి, ద్విచక్ర వాహన తయారీ సంస్థలు, వాహన కొనుగోలుదారుకు తప్పనిసరిగా 2 హెల్మెట్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. భారత ప్రమాణాల సంస్థ (ఐఎస్ఐ) ప్రమాణాలతో తయారుచేసిన హెల్మెట్లనే ద్విచక్రవాహనంతో పాటు దాని యజమానికి అందించాలి. 2026 జనవరి 1 నుంచి తయారయ్యే

తరువాయి 2లో



## కదిలిన జగన్నాథుని రథ చక్రాలు

- వేడుకగా విశ్వప్రసిద్ధ రథయాత్ర
- భక్తజన సంద్రంగా పూరీ

**జూన్ 27, సమయం న్యూస్, గోపాలపూర్:** హరిబోల్, జై జగన్నాథ్ అన్న భక్తుల నినాదాల మధ్య శుక్రవారం ఒడిశాలోని పూరీలో జగన్నాథుని నందిఘోష్ రథం కదిలింది. లక్షల మంది భక్తుల రాకతో పూరీ దివ్యధామం జనసంద్రాన్ని తలపించింది. శ్రీక్షేత్ర యంత్రాంగం పర్యవేక్షణలో పురుషోత్తముని సేవలన్నీ నిర్ణీత వేళల్లో జరిగాయి. తెల్లవారుజాము 4 గంటలకే ఆలయం తలుపులు తెరిచిన సేవాయత్‌లు జగన్నాథుడు, బలభద్ర, సుభద్ర,

తరువాయి 2లో



## సీబీఎన్ సీఎంగా ఉంటే క్రిమినల్స్‌కు చోటులేదు...



- సాంకేతిక పరిజ్ఞానం వైపు పోలీసులు మళ్లడం శుభపరిణామం
- వివేకా హంతకులను అప్పుడే అరెస్టు చేస్తే మళ్లీ నేరాలు చేసేవాళ్లా?
- గుంటూరులో పోలీసుశాఖ ఏఐ హ్యాకథాన్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, గుంటూరు (నెహ్రూనగర్): 'పోలీసులు సంప్రదాయం నుంచి సాంకేతిక పరిజ్ఞానం వైపు మళ్లడం శుభపరిణామం. దేశంలో ఎవరూ చేయని విధంగా ఏపీ పోలీసులు హ్యాకథాన్ నిర్వహించడం అభినందనీయం. నేరాలు లేనిచోట అభివృద్ధి వేగవంతమవుతుంది. దీన్ని గుర్తించి సంఘ విద్రోహశక్తులపై ఉక్కుపాదం మోపాం. ఫ్యాక్షనిస్టులు, మాఫియా, రౌడీమూకలను కట్టడి చేశాం.

తరువాయి 2లో

## 'ఆరోగ్య ఆంధ్ర'కు కుప్పం నుంచే తొలి అడుగు!

- టాటా సంస్థ సహకారంతో డీఐఎన్‌సీ సేవలు
- మారుమూల ప్రాంతంలో ఉన్నా వైద్యుల సూచనలు పొందే వీలు

**జూన్ 27, సమయం న్యూస్, చిత్తూరు, కుప్పం పట్టణం:** ఆరోగ్య ఆంధ్ర కల సాకారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం నుంచే తొలి అడుగు వేశారు. రాష్ట్రప్రభుత్వం, టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ కేంద్రాన్ని(డీఐఎన్‌సీ) కుప్పం ప్రాంతీయ ఆసుపత్రిలో నెలకొల్పారు. దీనికి నియోజకవర్గంలోని 11 పీహెచ్‌సీలు, 2 యూపీహెచ్‌సీలను అనుసంధానించి, ప్రయోగాత్మకంగా సేవలు ప్రారంభించారు. సీఎం

తరువాయి 2లో



# వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

(మొదటిపేజీ తరువాయి)

మధ్యప్రదేశ్ దేశంలో అగ్రస్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా 201112 నుంచి 202324 వరకు వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పాదక విలువపై కేంద్ర గణాంకశాఖ నివేదిక విడుదల చేసింది. దేశ స్థూల ఆర్థికవ్యవస్థలో వ్యవసాయ, అనుబంధ రంగాలు దాదాపు 18 శాతం వాటాతో ఆహారభద్రత కల్పించడంతోపాటు ఆర్థిక వ్యవస్థ బలోపేతం, ఉపాధి కల్పన, ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తున్నాయని తెలిపింది. అయితే గత 13ఏళ్లలో ఈ వాటా 18.5 శాతం నుంచి స్వల్పంగా తగ్గి 17.8 శాతానికి చేరినట్లు పేర్కొంది. వ్యవసాయేతర రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, వ్యవసాయం కేంద్రంగా ఉపాధికల్పన, గ్రామీణ జీవనోపాధికి ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు వ్యవసాయ ఆధునికీకరణ చేపట్టాల్సిన అవసరముందని సూచించింది. నివేదికలోని ముఖ్యాంశాలివి..

**తెలంగాణలో పరిస్థితి..**

* 2023..24లో రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాల విలువ రూ.1.12 లక్షల కోట్లుగా వెల్లడైంది.
* కూరల్లో వినియోగించే టమోటా, ఉల్లిపాయ సాగు పడిపోయింది. 201112 నుంచి 202324 వరకు కూరగాయలు, పండ్ల ఉత్పత్తి విలువ రూ.10,357 కోట్ల నుంచి రూ.3,933.89 కోట్లకు తగ్గింది. దేశవ్యాప్తంగా వీటి విలువ పెరుగుతుండటం గమనార్హం.
* పత్తి, జూట్ ఇతర నార ఉత్పత్తుల విలువలో రాష్ట్ర వాటా 9.3 నుంచి 13 శాతానికి పెరిగింది. మసాలా దినుసుల ఉత్పత్తిలో ఏపీతో సమానంగా రెండింతల వృద్ధిని తెలంగాణ నమోదు చేసింది. గతంలో పసుపు విలువ రూ.1,132.85 కోట్లుగా ఉంటే.. ఇప్పుడది రూ.426.43కి తగ్గింది.
* పప్పుధాన్యాల ఉత్పత్తి, ఉత్పాదక విలువ పడిపోయాయి. మూడేళ్ల క్రితం వరకు రూ.1,883 కోట్లు ఉంటే.. ఇప్పుడు రూ.1,176 కోట్లకు చేరింది.
* నూనెగింజలకు సంబంధించి వేరుసెనగ ఉత్పత్తి తగ్గిపోయింది. అలాగే చెరకు ఉత్పాదకత విలువ పడిపోయింది. పదేళ్ల క్రితం అది రూ.610.14 కోట్లు ఉంటే.. ప్రస్తుతం రూ.375.58 కోట్లకు చేరింది.
* మామిడి ఉత్పాదకత విలువ రూ.1,986.46 కోట్ల నుంచి రూ.1,314.92 కోట్లకు తగ్గింది. ద్రాక్ష, నిమ్మ తోటల పరిస్థితి అలాగే ఉంది. టమోటా ఉత్పాదకత విలువ గతంలో రూ.3,519 కోట్లు ఉంటే ఇప్పుడది రూ.435 కోట్లకు తగ్గింది.
* మాంసం ఉత్పత్తి విలువ రూ.9,224 కోట్ల నుంచి రూ.24,507 కోట్లకు పెరిగింది. గుడ్ల ఉత్పత్తి విలువ రూ.1,933.49 కోట్ల నుంచి రూ.3,964.52 కోట్లకు చేరింది.
* దేశంలో ఆర్థిక వ్యవస్థ విలువ రూ.274.13 లక్షల కోట్లు ఉంటే.. వ్యవసాయ, అనుబంధ రంగాల విలువ రూ.48.78 లక్షల కోట్లుగా ఉంది. గత 13 ఏళ్లలో ఈ రంగాలు 225% వృద్ధి నమోదు చేశాయి. 201112లో రూ.15.02 లక్షల కోట్లు ఉంటే.. 202324 నాటికి రూ.48.78 లక్షల కోట్లకు చేరింది.

# ద్విచక్ర వాహనంతో 2 హెల్మెట్లు తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)

అన్ని త్రిచక్ర వాహనాలకు యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టం అమర్చాలనీ ప్రతిపాదించింది. ఈ సిస్టం ఐఎస్14664:2010 నిబంధనలకు అనుగుణంగా ఉండాలని పేర్కొంది. ఈ రెండు సవరణలపై అభ్యంతరాలు, సూచనలు సలహాలు ఉంటే 30 రోజుల్లోపు commentsmorth@gov.in కి మెయిల్‌చేయాలని కేంద్ర రహదారి, రవాణాశాఖ తెలిపింది.

# చరిత్రను మలుపు తిప్పిన నేత పీవీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెట్టడంలో, విదేశాంగ విధానాన్ని బలోపేతం చేయడంలో, విద్యా రంగాన్ని ముందుకు తీసుకెళ్లడంలో పీవీ చేసిన సేవలు అనుసరణీయమని ప్రశంసించారు. జులై 26న కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాజ్‌భవన్‌లో మాజీ ప్రధాని వాజ్‌పేయీ చిత్రపటాన్ని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వీరజవాన్లను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్, అధికారులు పాల్గొన్నారు. రాజ్‌భవన్‌లో ఇప్పటికే మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ చిత్రపటాలు ఉండగా.. తాజాగా వాటి సరసన పీవీ చిత్రపటం చేరింది.

# మూడు విడతల్లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, కన్వీనర్, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూలును ఖరారు చేశారు. ఫీజులకు సంబంధించిన అంశంపై ప్రభుత్వానికి లేఖ రాయాలని, అక్కడి నుంచి వచ్చే సమాచారం ఆధారంగా ముందుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్, జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ ఆచార్య విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య కె.వెంకటేశ్వర్‌రావు, ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య డీన్‌కుమార్, ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చంద్రశేఖర్, ప్రవేశాల క్యాంపు అధికారి బి.శ్రీనివాస్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

**తొలిసారి మాక్ సీట్ల కేటాయింపు**

* ఉన్నత విద్యా మండలి తొలిసారిగా మాక్ సీట్ల కేటాయింపు ప్రక్రియను ఈసారి ప్రవేశపెట్టింది. అందులో సీట్లు పొందిన తర్వాత అవసరమైతే వెబ్ ఆప్షన్లు మార్చుకోవచ్చు.
* తొలి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు మెరుగైన కళాశాల, మెరుగైన బ్రాంచి కోరుకునే పక్షంలో రెండో విడతలో మళ్లీ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.
* రెండో విడత సీట్ల కేటాయింపు తర్వాత విద్యార్థులు తప్పనిసరిగా ఆయా కళాశాలల్లో స్వయంగా రిపోర్ట్ చేయాలి. ఆ సమయంలో ఒరిజినల్ టీసీ సమర్పించాలి. మిగిలిన విద్యార్హత ధ్రువపత్రాలు జిరాక్స్‌వి సమర్పిస్తే సరిపోతుంది.
* రెండో విడత కౌన్సెలింగ్ వరకు సీట్లను రద్దు చేసుకోవచ్చు. చెల్లించిన ఫీజు మొత్తం వెనక్కి ఇస్తారు. చివరి విడతలో అలాంటి అవకాశం ఉండదు. ఫీజు తిరిగి ఇవ్వరు.
* గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ ప్రవేశాలు జరుపుకొనే వెసులుబాటు ఉంటుంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఆగస్టు 23వ తేదీన వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

# మహిళా ‘శక్తి’ క్యాంటీన్లు

(మొదటిపేజీ తరువాయి)

తొలి దశలో జిల్లాకు ఐదు చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించి..తొలుత కామారెడ్డి కలెక్టరేట్‌లో 2024 మార్చి 27న ప్రారంభించారు. మంచి ఫలితాలు రావడంతో క్రమంగా విస్తరించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 150కిపైగా క్యాంటీన్లు మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. హనుమకొండ జిల్లాలోనే ఎనిమిది ఉన్నాయి.

**నాణ్యత, శుభ్రతకు ప్రాధాన్యం**

స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు రుణాలతో వీటిని ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనంతోపాటు అదనంగా పిండివంటలు, పచ్చళ్లు, ఊరగాయలు వంటివి విక్రయిస్తున్నారు. ఇందులో



ఆయా ఆహార పదార్థాల తయారీ దగ్గర్నుంచి, వినియోగదారులకు వాటిని అందించే వరకు అన్ని పనులూ సంఘ సభ్యులే స్వయంగా చూసుకుంటున్నారు. విక్రయాలతో వచ్చిన ఆదాయంతో నెలవారీ వాయిదాలు చెల్లించుకుంటున్నారు. వాయిదాలుపోనూ మిగిలిన సొమ్ముతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. నాణ్యత, శుభ్రతకు ప్రాధాన్యమిస్తుండటంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.



# కదిలిన జగన్నాథుని రథ చక్రాలు

(మొదటిపేజీ తరువాయి)

సుదర్శనుడితో కూడిన సన్నిధిలో మంగళహారతి, మైలం, అబకాశ, గోపాలవల్లభ సేవలు నిర్వహించారు. తర్వాత పొహండి వేడుకలో భాగంగా చతుర్థామూర్తులకు చాలమాల, సెనాపట అలంకరించారు. 10.40 గంటలకు ప్రారంభమైన పొహండి 12.10 గంటలకు ముగిసింది. రథాలు అధిరోహించిన దారు విగ్రహాల సన్నిధిలో ఇతర సేవలు కొనసాగాయి. మధ్యాహ్నం 2.05 గంటలకు పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి శిష్యగణంతో రథాలపైకి వచ్చి పూజలు చేశారు. పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ ఆనవాయితీ ప్రకారం చతుర్థామూర్తుల సన్నిధిలో బంగారు చీపురుతో చెరా పహరా చేసి, కస్తూరి కల్లాపి చల్లి హారతులిచ్చారు. అనంతరం రథాలకు అశ్వాలు, సారథులు అమర్చి తాళ్లు కట్టారు. తొలుత 4.10 గంటలకు బలభద్రుని తాళధ్వజ రథం యాత్రగా బొడొదండొ మీదుగా గుండిచాదేవి ఆలయం వైపు కదిలింది. దేవీ సుభద్ర దర్పదళన్, చివరిగా పురుషోత్తముని నందిఘోష్ రథాలు అమ్మ మందిరానికి కదిలాయి. భక్తులు జగన్నాథుడిని స్మరిస్తూ రథాలు లాగేందుకు పోటీపడ్డారు. చీకటిపడే వరకూ రథయాత్ర సాగింది. 7.10 గంటలకూ రథాలు గుండిచాదేవి మందిరానికి చేరుకోకపోవడంతో యాత్రను మధ్యలోనే నిలిపివేశారు. నేడు నిలిపివేసిన చోటు నుంచే యాత్ర మళ్లీ ప్రారంభించి.. రథాలను గుండిచా మందిరానికి చేర్చనున్నారు.

# సీబీఎన్ సీఎంగా ఉంటే క్రిమినల్స్‌కు చోటులేదు

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక పరిజ్ఞానంపై ఎంత శ్రద్ధ పెట్టానో శాంతిభద్రతలు కాపాడటానికీ అంతే ప్రాధాన్యం ఇచ్చా. సీబీఎన్ సీఎంగా ఉంటే రాష్ట్రంలో క్రిమినల్స్‌కు చోటు లేదు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఆంధ్రప్రదేశ్‌ను నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి’ అని పోలీసులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. గుంటూరు శివారులోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఏఐ హ్యాకథాన్ మూడురోజుల సదస్సును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు కళాశాలలో ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. హ్యాకథాన్‌లో పాల్గొన్న ఐటీ కంపెనీల ప్రతినిధులు, ఏఐ నిపుణులతో వారి ఆవిష్కరణలపై చర్చించారు. అనంతరం హ్యాకథాన్‌లో పోలీసులు, విద్యార్థులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు.

**ఏఐలో ఇది ఆరంభమే**

‘ఏఐ విషయంలో ఇది ఆరంభమే. ప్రజల డేటాను ఏఐతో విశ్లేషించి సమస్యలకు పరిష్కారం చూపాలి. ఒకప్పుడు కృత్రిమ ఉపగ్రహాల తయారీ, ప్రయోగాలు ప్రభుత్వ స్థాయిలో ఉండేవి. ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులూ తయారుచేస్తున్నారు. స్పేస్ సిటీ ఏర్పాటుద్వారా మనమే సొంతంగా ఉపగ్రహ ప్రయోగాలు చేసే అవకాశం కల్పిస్తాం. గతంలో ఐటీ గురించి మాట్లాడినట్లు ఇప్పుడు ఏఐ గురించి మాట్లాడుతున్నారు. అమెరికాలో సిలికాన్ వ్యాలీ... ఇక్కడ క్వాంటమ్ వ్యాలీ. థింక్ గ్లోబల్లీ.. యాక్ట్ గ్లోబల్లీ... వర్క్ లోకల్లీ అనే నినాదం అందిపుచ్చుకోవాలి’’ అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**మేధోశక్తితో తెలివిగా పనిచేయాలి**

‘రేపు జరిగేది ఈరోజే ఆలోచిస్తా. ప్రస్తుతం పనితీరు మారింది. ఇంటివద్దే పనిచేసే వెసులుబాటు వచ్చింది. నాలెడ్జి ఎకానమీలో తెలుగువారు నంబర్ వన్‌గా ఉండాలనేది నా ఆకాంక్ష. ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నా. ఐఓటీ, రోబో, సెన్సర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజాజీవనం సులువైపోయింది. ర్యాపిడో వ్యవస్థాపకులు గుంటూరుకు చెందిన వారే. యాప్ ద్వారా వాహన యజమానులు, ప్రయాణికులను అనుసంధానం చేస్తున్నారు. ఇలా వినూత్నంగా ఆలోచిస్తే ప్రపంచాన్ని పాలించే అవకాశం మన ముందే ఉంది. ఏఐ వస్తే ఉద్యోగాలు పోతాయని కొందరు అంటున్నారు. అది సరికాదు. రాష్ట్రంలో ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చేస్తున్నాం. స్మార్ట్ వర్క్ నేర్చుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోనూ డేటాబ్యాంక్ ఉంటుంది. అది సంపద. గతంలో ఐటీని ప్రమోట్ చేశాం. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ ద్వారా తెలుగువారి సత్తా చాటబోతున్నాం’’ అని చంద్రబాబు ఆకాంక్షించారు.

# ‘ఆరోగ్య ఆంధ్ర’కు కుప్పం నుంచే తొలి అడుగు !

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు ఈ సేవలకు వచ్చే నెలలో లాంఛనంగా శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం చిత్తూరు జిల్లా, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నారు.

**భద్రంగా ఆరోగ్య చరిత్ర**

ముందుగా పీహెచ్‌సీలకు వచ్చే రోగుల వివరాలన్నింటినీ డిజిటలైజ్ చేస్తారు. ఆరోగ్యసమస్య, చికిత్స చేసిన వైద్యుడి పేరు, వాడిన, వాడుతున్న ఔషధాల వివరాలు కంప్యూటర్‌లో నమోదుచేస్తారు. దానికో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించి రోగికి ఇస్తారు. భవిష్యత్తులో ఆ వ్యక్తి వేరే ఏదైనా ఆసుపత్రికెళ్లినా... తన ఐడీ వైద్యుడికి చెబితే చాలు. వైద్యుడు ఆ వ్యక్తి ‘హెల్త్ హిస్టరీ’ తెలుసుకొని, మెరుగైన చికిత్స అందిస్తారు. ఒక్కసారి వివరాలు డిజిటల్ అయితే.. నెర్వ్ కేంద్రం ద్వారా ఎక్కడున్నా వైద్యుల సూచనలు పొందొచ్చు. గర్భిణులు, బాలింతల సేవలపై నెర్వ్ కేంద్రం ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలను అప్రమత్తం చేస్తుంది. నెర్వ్‌కేంద్రాల్లో వైద్యులు, ఏఎన్‌ఎంలు నిత్యం అందుబాటులో ఉంటారు. ఈ కేంద్రాల ద్వారా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందుతాయని చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.

**వర్చువల్‌గా వైద్యుల సూచనలు**

ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 30.90 లక్షల మంది డీఐఎన్‌సీ సాయం పొందారు. రోగి మారుమూల ప్రాంతంలో ఉన్నా.. వీడియోకాల్ ద్వారా వైద్యులతో మాట్లాడుతున్నారు.



1.17 లక్షల మంది వర్చువల్ పద్ధతిలో వైద్యుల సూచనలు, తీసుకున్నారు. నెర్వ్ కేంద్రానికి కాల్ చేసి రోగి ఐడీ చెప్పగానే వైద్యులు వివరాలు పరిశీలించి, సమస్య తెలుసుకొని సూచనలు అందజేస్తున్నారు. కర్ణాటకలోని కోలారు జిల్లా, హిమాచల్‌ప్రదేశ్‌లోని బిలాస్‌పురంలతోపాటు చెన్నై, కోల్‌కతా, గువాహటిలోనూ ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. మంత్రులు లోకేశ్, సత్యకుమార్ గతేడాది కోలారు వెళ్లి డీఐఎన్‌సీలను పరిశీలించారు.

# ఆంధ్రప్రదేశ్ లాంటి ప్రదేశం ప్రపంచంలో మరోటి లేదు

* **ప్రపంచపటంలో ఆంధ్రప్రదేశ్‌ను పైకి తేవాలంటే చంద్రబాబే కావాలి: రాందేవ్ బాబా**

అమరావతి: ‘వియత్నాం, స్విట్జర్లాండ్, యూరప్ అని ఎక్కడెక్కడో తిరుగుతుంటాం కానీ, ఆంధ్రప్రదేశ్ లాంటి పర్యాటక గమ్యస్థానం ప్రపంచంలో మరెక్కడా లేదు’ అని ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా అన్నారు. ‘ఇతర రాష్ట్రాలను నేను కించపరచడం లేదు. కానీ, ఏపీలో ఉన్న సుందరమైన అటవీప్రాంతం, సముద్ర తీరం, వైవిధ్యమైన వాతావరణం దేనికదే ప్రత్యేకం. గుజరాతీలు, మరాఠీలను, హిందీ మాట్లాడేవారినీ ఏపీలో పర్యటనలకు తీసుకొస్తా. ఏపీ పర్యాటకానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేందుకు నేను సిద్ధం’ అని ప్రకటించారు. శుక్రవారం



విజయవాడలో జరిగిన టూరిజం కాన్‌క్లేవ్‌లో ఆయన మాట్లాడారు.

**అంబానీల్లాగా పెళ్లి చేసుకునేలా..**

‘అంబానీల్లాగా పెళ్లి చేసుకోవాలనే కోరిక చాలామందికి ఉండవచ్చు. అలాంటి వారందరికీ నచ్చేలా దిండిలో వెడ్డింగ్ డెస్టినేషన్ క్రూజ్‌ను ఏర్పాటుచేస్తాం. వేదపండితులు, పూజసామగ్రి, మ్యూజిక్ వంటివన్నీ సమకూరుస్తాం. దిండి ఒక పెద్ద వెడ్డింగ్ డెస్టినేషన్ అవుతుంది. రాబోయే రోజుల్లో ప్రపంచం మొత్తమ్మీద వెడ్డింగ్ డెస్టినేషన్‌గా ఆంధ్రప్రదేశ్ అవుతుంది. అందుకు అవసరమైన మార్కెటింగ్‌ను నేనే ఉచితంగా చేస్తా’ అని బాబా హామీనిచ్చారు.

* **ప్రపంచ పటంలోకి హార్సిలీ హిల్స్‌ని తెస్తాం**

‘హార్సిలీ హిల్స్‌ను ఐకానిక్ వెల్‌నెస్ కేంద్రంగా ప్రపంచపటంలోకి తీసుకొస్తాం. ఏపీలో ఏమైనా చేద్దామని ఆలోచిస్తుండగా.. చంద్రబాబు నాతో మాట్లాడారు. వెల్‌నెస్ సేవలను అందుబాటులోకి తేవాలని సూచించారు. రూ.500 కోట్లకు పైగా పెట్టుబడితో వెల్‌నెస్ సేవలను తీసుకొస్తాం’ అని బాబా తెలిపారు.

* **సూర్యలంకలో ప్రపంచస్థాయి వెల్‌నెస్ కేంద్రం**

బాపట్ల: బాపట్ల జిల్లా సూర్యలంక తీరంలో ప్రపంచస్థాయి వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించనున్నట్లు రాందేవ్‌బాబా తెలిపారు. సూర్యలంక తీరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పర్యాటక శాఖ బీచ్ రిసార్టులు, బీచ్ వద్ద భూములను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చేలా గొప్ప వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించి త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. సూర్యలంకకు చాలా పెద్ద ప్రాజెక్టు వస్తుందని తెలిపారు. సంస్థ సీఈవో బాలకృష్ణ కూడా పాల్గొన్నారు.



## బర్కత్‌పుర డిపోలో టీఎస్ఆర్టీసీ "5రోజుల పుణ్యక్షేత్ర యాత్ర బస్ టూర్

* **జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**

అంబర్ పేట, జూన్, 27(సమయం న్యూస్) : ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించే దిశగా, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TSRTC) చేపట్టిన 5 రోజుల పుణ్యక్షేత్ర యాత్ర బస్ టూర్ ఈరోజు బర్కత్‌పుర డిపోలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేశ్ గారు మరియు కార్పొరేటర్ శ్రీమతి కన్న ఉమా రమేష్ యాదవ్ గారు హాజరై, పథకానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ టూర్ ద్వారా భక్తులు అనేక ప్రముఖ పుణ్యక్షేత్రాలను సురక్షితంగా, సౌకర్యవంతంగా, చవకగా దర్శించుకునే అవకాశం పొందనున్నారు. ప్రజలకు సులభంగా ఆధ్యాత్మిక యాత్రలు అందించాలనే లక్ష్యంతో TSRTC ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రారంభ కార్యక్రమంలో TSRTC అధికారులు, సిబ్బంది మరియు యాత్రలో పాల్గొంటున్న భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు TSRTC ఈ వినూత్న యత్నాన్ని అభినందించారు.




## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్ పేట,జూన్,27 (సమయం న్యూస్) : అంబర్ పెట్ డివిజన్ చెన్నారెడ్డి నగర్ లో 31 లక్షల రూపాయల నిధులతో నూతన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన అంబర్ పెట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్పొరేటర్ మరియు స్థానిక బస్తీ ప్రజలతో కలిసి చెన్నారెడ్డి నగర్ లో నూతన రహదారి పనులను ప్రారంభించి,స్థానిక బస్తీ ప్రజలతో కలిసి చెన్నారెడ్డి నగర్,మరియు న్యూ పటేల్ నగర్ లో పర్యటించడం జరిగింది. స్థానికంగా ఉన్నటువంటి సమస్యలని స్థానిక ప్రజలు తెలియజేయడంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్య,నల్ల నీరు లోప్రెషర్ సమస్య, సి బ్లాక్ లో వీధి దీపాల సమస్య గురించి అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో AE ప్రదీప్ కుమార్,వర్క్ ఇన్స్పెక్టర్లు రమేష్,దుర్గ,జిహెచ్ఎంసి సిబ్బంది నరసింహ,విద్యుత్ సిబ్బంది మన్సూర్,బిఆర్ఎస్ అంబర్ పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు,మహిళా నాయకులు స్థానిక బస్తి ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నీతి ఆయోగ్ డెల్టా ర్యాంకింగ్ విడుదల

: **జోగులాంబ గద్వాల జిల్లాలోని గట్టు బ్లాక్ దేశవ్యాప్తంగా 5వ స్థానం, జోన్-3లో 2వ స్థానం సాధించిందిగా ఘనత**

జోగులాంబ గద్వాల జూన్27 (సమయం న్యూస్) : నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ (ABP) 2024-25 (జనవరి - మార్చి 2025) Q4 డెల్టా ర్యాంకింగ్ లో గట్టు బ్లాక్ దేశవ్యాప్తంగా 500 బ్లాక్‌లలో 5వ స్థానం, జోన్ 3లో 2వ స్థానం (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు కలిపిన జోన్) సాధించిందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలియజేశారు. ఈ ప్రగతికి గుర్తింపుగా, త్వరలో నితి ఆయోగ్ తరపున గట్టు బ్లాక్‌కు ఒక కోటి రూపాయల పురస్కారం అందజేయ బడుతుందని తెలిపారు. ఈ ర్యాంకింగ్ నీతి ఆయోగ్ నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 500 ఆస్పిరేషనల్ బ్లాక్‌లు పాల్గొన్న సందర్భంలో ప్రకటించబడింది. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ప్రధాన కార్యాలయంలో ప్రారంభమైన 'వాల్ ఆఫ్ ఫేమ్' లో టాప్ ర్యాంక్ సాధించిన బ్లాక్‌ల విజయ గాథలు ప్రదర్శించబడతాయి. ఇది ఆస్పిరేషనల్ బ్లాక్స్ మరియు డిస్ట్రిక్ట్



ప్రోగ్రామ్‌లు దేశాన్ని వికసిత భారత్ 2047 లక్ష్యం వైపు నడిపించేందుకు ఎలా పని చేస్తున్నాయో చూపిస్తుంది. ఈ ర్యాంకింగ్‌ను 5 ప్రధాన అంశాలకు గాను ఉన్న 39 కీలక పనితీరు సూచికలు (KPIs) ఆధారంగా నిర్ణయించబడింది:

1. ఆరోగ్యం మరియు పోషణ, 2 విద్య, 3. వ్యవసాయం మరియు అనుబంధ సేవలు, 4. ప్రాథమిక మౌలిక సదుపాయాలు, 5.సామాజిక అభివృద్ధి 2024 అక్టోబర్-డిసెంబరు త్రైమాసికం నుండి 2025 జనవరి-మార్చి త్రైమాసికం మధ్యలో ఘట్టు బ్లాక్ యొక్క కంపోజిట్ స్కోర్ 61.24నుండి 69.43కు పెరిగి, 8.19% అభివృద్ధిని నమోదు చేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్, IAS గట్టు మండలం అధికారులు, విభాగాధిపతులు, ఫ్రంట్ లైన్ వర్కర్లను అభినందిస్తూ - "ఇది అందరి సమిష్టి కృషి ఫలితంగా సాధ్యమైందని, 100% KPI లక్ష్యసాధనకు అందరూ అంకితభావంతో పని చేస్తున్నారని," కొనియాడారు.

# అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాం..

* **పఠాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
* **బొల్లారంలో అంగరంగ వైభవంగా పూరి జగన్నాథుడి రథయాత్ర..**
* **రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్..**
* **వేల సంఖ్యలో తరలివచ్చిన ఒరిస్సా వాసులు, జగన్నాథుడి భక్తులు..**

జిన్నారం, జూన్ 27, సమయం న్యూస్ : పూరి జగన్నాథుడి విశ్వ ప్రసిద్ధ రథయాత్ర పురస్కరించుకుని.. బొల్లారం మున్సిపల్ పరిధిలో గల జగన్నాథుని ఆలయంలో నిర్వహించిన రథయాత్ర కార్యక్రమానికి శుక్రవారం పఠాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం.. రథయాత్ర కార్యక్రమాన్నిలాంఛనంగాప్రారంభించారు వేలాది భక్తుల జయ జయధ్వనుల మధ్య రథయాత్ర ప్రారంభమైంది.ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, మినీ ఇండియా గా పేరుందిన బొల్లారం మున్సిపాలిటీలోని అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ వారి ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నామని తెలిపారు. పూరి జగన్నాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో



ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల పండుగలను సమ ప్రాధాన్యతతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కోలాన్ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### జిల్లా కేంద్రంలో గల రిమ్స్ పరిశీలించిన

# జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణవరావు, వివేక్

ఆదిలాబాద్ జూన్27 (సమయం న్యూస్) : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిని మంత్రి సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలు, పారిశుధ్యం, డాక్టర్ల వివరాలను, అందుతున్న సేవలపై రిమ్స్ డైరెక్టర్ ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ప్రతీ రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని అన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వీధివ్యాపారుల సమస్యలని అడిగి తెలుసుకొని ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా చూడాలని, వీధివ్యాపారులు తమ జీవనోపాధి కోల్పోకుండా తగు చర్యలు తీసుకోవాలని



జిల్లా కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్ లకు సూచించారు. అనంతరం మావల పార్కును సందర్శించి సహజసిద్ధమైన చెరువును అభివృద్ధి చేసేలా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అడవుల జిల్లా ఆదిలాబాద్ జిల్లా లో టూరిజం కేంద్రాలను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లాలో పర్యాటకానికి సంబంధించి, జలపాతాలు పార్కు ల అభివృద్ధికి తగు నివేదిక తయారు చేయాలని ఆదిలాబాద్ DFO ప్రశాంత్ బాజీరావు పాటిల్ కు సూచించారు. ఇక్కడి ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందితే రాష్ట్రం నుండే కాకుండా దేశ నలుమూలల నుండి పర్యాటకులు ఇక్కడికి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఉట్నూర్ లోని.13.70 లక్షలతో ఉట్నూర్ PHC లో 50 పడకల కమ్యూనిటీ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రి అప్ గ్రేడ్ చేసిన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, శాసన సభ్యులు వెడ్మ బొజ్జు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి తక్షణమే అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి

* **బిజెపి, కాంగ్రెస్ పార్టీలు చిత్తశుద్ధి చూపించాలి**
* **బిజెపి నిర్లక్ష్యం వహిస్తోంది**
* **బీసీలను బిఆర్ఎస్ మోసం చేసింది.**
* **బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు ఐఏఎస్ (రిటైర్డ్)**

హైదరాబాద్ జూన్ 27(సమయం న్యూస్) : నలభై రెండు శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బిల్లు ఆమోదింప చేయాలని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టీ చిరంజీవులు అన్నారు. లేని పక్షంలోబీసీలం పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం నాడు మధ్యాహ్నం ప్రెస్ క్లబ్ లో పలు బీసీ సంఘాల నేతలతో కలిసి సంయుక్తంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు బీసీల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, బిజెపిలకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రంలో బిల్లు ఆమోదింప చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వము బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్ పాస్ చేసి కేంద్రానికి పంపి ఇప్పటికీ మూడు నెలల సమయం కావస్తున్నా కేంద్రంలో కదలిక లేదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి బిల్లు పంపిన అనంతరం ఏడుసార్లు క్యాబినెట్ మీటింగ్ జరిగిందని ఈ బిల్లును మాత్రం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి వేగంగా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని లేని పక్షంలో బీసీలు అంతా కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు .ప్రధాని నరేంద్ర మోడీ అపాయింట్మెంట్స్ ఇవ్వకపోతే ధర్నా చేయాలని సూచించారు. 42 శాతం రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పోరాటం చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కేంద్రంలో బిజెపి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తేవడంలో కేవలం ఎనిమిది రోజుల్లోనే చట్టం చేసి దేశవ్యాప్తంగా అమలు చేసిందని అదే బీసీల బిల్లు విషయంపై పూర్తిగా నిర్లక్ష్యగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. బీసీ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు బిజెపి కాంగ్రెస్ లు కలిసి కృషి చేయాలని కోరారు. కోర్టు తీర్పులు కూడా బీసీలకు ప్రతికూలంగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల పరిరక్షణ 9వ షెడ్యూల్ లో చేర్చడం ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే రిజర్వేషన్ల జీవోలు కోర్టులో నిలబడవని తెలిపారు. భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు మౌలిక సూత్రాలకు అనుకూలమే కాబట్టి 9వ షెడ్యూల్లో పెడితే కోర్టులు సమీక్షించమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి లో ఇచ్చిన హామీ మేరకు కచ్చితంగా 42% రిజర్వేషన్లు అమలు చేయాలని అందుకు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షులు బాలరాజ్ గౌడ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోర్ కమిటీ సభ్యులు చామకూర రాజు, కె వి గౌడ్, పాలకురి అశోక్, చెన్న శ్రీకాంత్ ఒంటెద్దు నరేందర్, ఘోర శ్యామ్, శ్రీనివాస్, దుర్గయ్య గౌడ్, అవ్వారు వేణు, కొండల్ గౌడ్, నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, బైరు శేఖర్, ఆయిలి వెంకన్న గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్, ఎర్ర మాద వెంకన్న, రాపోలు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుండి నగర వాసులకు అందుబాటు లోకి రానున్న పి జె ఆర్. ఫ్లై ఓవర్

* **ఔటర్ రింగ్ రోడ్డు నుండి జనార్ధన్ రెడ్డి(శిల్పా లే ఔట్ రెండో ఫేస్) ఫ్లైఓవర్ ముఖ్యమంత్రి చేతుల మీదిగా రేపు ప్రారంభం:**
* **ఇక ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు!**

హైదరాబాద్, జూన్ 27(సమయం న్యూస్): ఔటర్ రింగ్ రోడ్డు నుండి కొండాపూర్ వరకు చేపట్టిన పి జె ఆర్ ఫ్లై ఓవర్ నేడు శనివారం ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే, హైదరాబాద్ ప్రజలకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఔటర్ రింగ్ రోడ్ (ORR) నుండి కొండాపూర్ వరకు అత్యాధునిక మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి అయిన నేపథ్యంలో జూన్ 28న రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే, గచ్చిబౌలి



జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది మరియు ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది.

**ప్రాజెక్ట్ వివరాలు:**

ఈ ఫ్లైఓవర్‌ను వ్యూహాత్మక రహదారి అభివృద్ధి కార్యక్రమం (SRDP) కింద రూ. 182.72 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఇది 1.2 కి.మీ పొడవు మరియు 24 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్‌లతో ఉంటుంది. దీని ప్రత్యేకత ఏమిటంటే ఇది ఇప్పటికే ఉన్న రెండు ఫ్లైఓవర్లపై నిర్మించిన మూడవ స్థాయి నిర్మాణం. క్రింద గచ్చిబౌలి జంక్షన్ ఫ్లైఓవర్ ఉంది, దాని పైన శిల్పా లేఅవుట్ ఫేజ్ 1 ఫ్లైఓవర్ ఉంది మరియు ఇప్పుడు దాని పైన ఫేజ్ 2 ఫ్లైఓవర్ నిర్మించబడింది. ప్రయాణికుల ట్రాఫిక్ కష్టాలు పరిష్కారమవుతాయి. ఈ ఫ్లైఓవర్ గచ్చిబౌలి జంక్షన్ వద్ద తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను చాలా వరకు తగ్గిస్తుంది. మెరుగైన కనెక్టివిటీ: ORR నుండి కొండాపూర్ మరియు హఫీజ్‌పేట్ మార్గాలకు వెళ్లే వాహనాలకు ఇది చాలా అనుకూలంగా ఉంటుంది. ఇది హైటెక్ సిటీ మరియు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. ప్రయాణ సమయాన్ని ఆదా చేయడంతో పాటు, మీరు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా చేరవలసిన గమ్యస్థానాలను వేగంగా చేరుకోవచ్చు. కొండాపూర్ ప్రాంతం నుండి, శంషాబాద్ విమానాశ్రయం అక్కడి నుండి కొండాపూర్ ప్రాంతాలకు గచ్చిబౌలి వద్ద ఎటువంటి ట్రాఫిక్ జామ్‌లు లేకుండా నేరుగా చేరుకోవచ్చు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభం హైదరాబాద్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన అడుగు అవుతుంది. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు SRDP పెద్ద పునాది వేసిన నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్ ద్వారా 23వ ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. SRDP ద్వారా ఫ్లైఓవర్లు చేపట్టినా, నగరంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిర్ణీత సమయంలో నేరుగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు. SRDP ద్వారా చేపట్టిన మొత్తం 42 పనులలో 37 పనులు ఈ ఫ్లైఓవర్‌తో పూర్తయ్యాయి. ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి మరియు శాస్త్రిపురం ROB పనుల రైల్వే భాగాన్ని రెండు మూడు నెలల్లో పూర్తి చేయాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ లక్ష్యంగా పెట్టుకుని రైల్వే అధికారులను కోరారు. జూలై చివరి నాటికి ఫలక్‌నుమా ROB పనులను, ఆగస్టు చివరి నాటికి శాస్త్రిపురం ROB పనులను పూర్తి చేయాలని కమిషనర్ వారికి లక్ష్యంగా నిర్దేశించారు.




## బైకుల దొంగలను అరెస్టు చేసిన బొల్లారం పోలీసులు

* **దొంగల నుంచి 9 బైకుల స్వాధీనం**
* **వివరాలు వెల్లడించిన సీఐ రవీందర్ రెడ్డి**

జిన్నారం, జూన్ 27, సమయం న్యూస్ : పలు ప్రాంతాల్లో బైక్లను దొంగతనం చేస్తున్నముఠాను బొల్లారం పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ రవీందర్ రెడ్డి వెల్లడించారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని కిష్టాయపల్లి సర్కిల్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆటోలో ఉన్న కొంతమంది వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు ఆటోలో ఉన్న వ్యక్తులపై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించారు. కౌడిపల్లి గ్రామానికి చెందిన షేక్ ఫక్రుద్దీన్, మీనం పల్లి జగన్, బౌరంపేట రాజేష్ లు గత 20 రోజుల నుంచి దుండిగల్, సూరారం, నర్సాపూర్ పీఎస్ పరిధిలోని పలు గ్రామాల్లో బైక్ లను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వారి దగ్గర నుంచి 9 బైకులతో పాటు వారికి సహకరించిన ఆటో డ్రైవర్ జగన్ తో సహా ని నిందితులందరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసులో చేదించేందుకు కృషి చేసిన ఎస్ఐ కృష్ణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి, కానిస్టేబుల్ జైపాల్ లకు రివార్డులు అందించి అభినందించినట్లు సీఐ వివరించారు.

# ప్రజల మన్ననలు పొందేలా రోడ్లు భవనాలు శాఖ ఇంజనీర్లు పనిచేయాలి

* **ఇంజనీర్లు మనసు పెట్టి పని చేస్తూ..డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకురావాలి**
* **ముఖ్యమంత్రి,నేను మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేయాలి**
* **ఆర్ అండ్ బి శాఖ బలోపేతం పై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి**



హైదరాబాద్ జూన్27(సమయం న్యూస్): రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖను పటిష్ట పరిచేందుకు ఆర్ అండ్ బి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్ని రకాల చర్యలు చేపడుతున్నారు. ఆర్ అండ్ బి శాఖ బలోపేతం పై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి అందుకు అనుగుణంగా పలు కీలక నిర్ణయాలకు శ్రీకారం చుట్టారు. గతంలో పెద్ద ఎత్తున ఏ.ఈ, డి.ఈ,ఈ.ఈ,ఎస్.ఈ,సి.ఈ.ఇంజనీర్లకు ప్రమోషన్స్ పోస్టింగ్ ఇస్తూ శాఖ పరమైన నిర్ణయం తీసుకున్న మంత్రి, ప్రస్తుతం ఒక్క రోజే 64 మంది డిప్యూటీ ఇంజనీర్లు కు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గా ప్రమోషన్ తో పాటు పోస్టింగ్ ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి శ్రీ ఏ.రేవంత్ రెడ్డి ని ఒప్పించి ఏ శాఖలో లేని విధంగా ప్రత్యేకంగా రోడ్లు భవనాలు శాఖ లో ప్రమోషన్స్, పోస్టింగ్స్ ఇప్పించానని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి, తాను ఇంజనీర్లపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ ఆ స్థాయిలో ప్రజల మన్ననలు పొందేలా రోడ్లు భవనాలు శాఖ ఇంజనీర్లు పనిచేయాలనీ ఆదేశించారు. రాష్ట్ర ఇన్ఫ్రా డెవలప్మెంట్ లో ఆర్ అండ్ బి కీలకంగా వ్యవహరిస్తున్నందున అధికారులపై గురుతర బాధ్యత ఉందని, మనసు పెట్టి పని చేస్తూ.. డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకురావాలనీ,శాఖ బలోపేతం కోసం ఇంజనీర్లు అత్యంత కీలకంగా పనిచేయాలని సూచించారు. ప్రజల్లో ఆర్ అండ్ బి శాఖకు మంచి పేరు తెచ్చేలా వ్యవహరించాలని కొత్తగా ప్రమోషన్, పోస్టింగ్ వచ్చిన వారిని ఉద్దేశించి మాట్లాడిన మంత్రి, ఆర్ అండ్ బి సర్వీస్ రూల్స్ అమెండ్మెంట్ చేసుకొని 6ఏళ్ల సర్వీస్ నిండిన 38మంది అసిస్టెంట్ ఇంజనీర్లను, AEE లుగా అప్ గ్రేడ్ చేసుకున్నామని,AEE నుండి డిప్యూటి ఇంజనీర్లు గా 118 మంది కి(DPC) డిపార్ట్మెంట్ ప్రమోషన్ ప్యానెల్ అప్రూవ్మెంట్ ఇచ్చుకున్నామని తెలిపారు. అందులో ఇప్పటికే 102 మందికి ప్రమోషన్ తో పోస్టింగ్స్ కూడా ఇచ్చామన్నారు. అట్లాగే.. డిప్యూటీ ఇంజనీర్లు నుండి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గా 72 మంది ప్రమోట్ కాగా ఇవాళ 64 మందికి ప్రమోషన్,పోస్టింగ్స్ కల్పించామని, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నుండి సూపరింటెండ్ ఇంజనీర్లు గా 29 మందికి, సూపరింటెండ్ నుండి చీఫ్ ఇంజనీర్లు గా నలుగురుని(4) ప్రమోషన్ వచ్చిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు ముగ్గురు సి.ఈ లు ఇంజనీర్ ఇన్ చీఫ్ గా పనిచేశారని,ప్రస్తుతం మహిళా ఈఎన్సీ తిరుమల ఆర్ అండ్ బి శాఖకు హెచ్ఓడి స్థాయిలో సేవలు అందిస్తున్నారని మంత్రి గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి శాఖ ఇంజనీర్లకు అందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. డిపార్ట్ మెంట్ లో ఖాళీలు కూడా వెంటనే భర్తీ చేసేందుకు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కు ఎప్పటికప్పుడు వివరాలు పంపుతున్నామని మంత్రి పేర్కొన్నారు. అయితే.. గురువారం నాడు నల్గొండ పర్యటన బిజి షెడ్యూల్ ఉన్నా కానీ పర్యటన పూర్తి చేసుకుని వచ్చి.. అలసటను లెక్క చేయకుండా ఈ.ఈ ల ప్రమోషన్స్ పోస్టింగ్ పై మంత్రి అధికారులతో చర్చించి ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వస్తుందేమో అని ఆందోళన వ్యక్తం చేసిన ఇంజనీర్లకు మంత్రి తీపి కబురు చెప్పారు. ముఖ్యమంత్రి తో మాట్లాడి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు నిబంధనలు సడలింపులు ఇచ్చి మరి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రమోషన్స్,బదిలీలు చేశారని ఆర్ అండ్ బి ఇంజనీర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి మంత్రి శ్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నాయకత్వంలో రోడ్లు భవనాలు శాఖ బలోపేతానికి కష్టపడతామనీ ఇంజనీర్లు ప్రతినబూనారు. మంత్రి గారి సూచనల మేరకు ప్రజల్లో మన్ననలు పొందేలా పని చేస్తామని..మంత్రికి ప్రమోషన్,పోస్టింగ్స్ పొందిన ఇంజనీర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

రాయపోల్, జూన్27 అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పాపని అంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో ఎంపీ ఓ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ ఏఈ అసదుద్దీన్ తో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ లతో పాటు ఇతర హామీలను నెరవేరుస్తుందన్నారు. నిరుపేదలకు సొంతింటి కల నెరవేరబోతుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ భాగ్యలక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శాతం రాములు, వేముల కవిత, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయండి

* **డైరెక్టర్లకు కావాల్సినంత స్వేచ్ఛనిస్తాం, ప్రభుత్వ ఆశయాలు నెరవేర్చండి**
* **విద్యుత్ ఒప్పందాల అమలుపై రోజువారి సమీక్షలు చేయండి**
* **జెన్ కో అధికారులు, డైరెక్టర్ల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

హైదరాబాద్ జూన్27(సమయం న్యూస్):రాబోయే 5,పది సంవత్సరాలకు రాష్ట్రంలో ఏర్పడనున్న విద్యుత్తు డిమాండ్ అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రజాభవన్లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, జెన్కో డైరెక్టర్లతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023లో మార్చిలో వచ్చిన 15,497 మెగావాట్ల పీక్ డిమాండ్, 2025 మార్చిలో వచ్చిన 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ ను దృష్టిలో పెట్టుకొని 202930 నాటికి ఎంత మేరకు డిమాండ్ పెరుగుతుంది, అదే పద్ధతిలో 203035, 2047 సంవత్సరాలకు ఏర్పడే విద్యుత్తు డిమాండ్ అందుకు అనుగుణంగా వివిధ మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలపై ప్రణాళికలను సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ, మూసి పునర్జీవనం, పెరుగుతున్న పరిశ్రమలు, వ్యవసాయ వినియోగం, మారిన జీవన ప్రమాణాలకు అనుగుణంగా పెరగనున్న విద్యుత్ వినియోగం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు అంచనాలు రూపొందించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు రాష్ట్ర ప్రభుత్వం 24గంటల పాటు ఉచిత విద్యుత్ ను అందిస్తుంది ఇందుకు గాను ఆర్థిక శాఖ ద్వారా విద్యుత్ సంస్థలకు సంవత్సరానికి 12,500కోట్లు చెల్లింపులు జరుగుతున్నాయి అన్నారు. నిరుపేదలకు ఆర్థిక చేయూతను అందించేందుకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం ప్రస్తుతం వీటి విలువ2 వేల కోట్ల వరకు ఉంది అది భవిష్యత్తులో పెరిగి మూడు వేల కోట్ల వరకు చేరుకునే అవకాశం ఉంది మొత్తంగా ఉచిత విద్యుత్ పథకాలకు భవిష్యత్తులో 17 వేల కోట్ల వరకు ఆర్థిక శాఖ నుంచి విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుందని వివరించారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని గ్రీన్ ఎనర్జీని పెద ఎత్తున ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేసుకుని వేగంగా కార్యాచరణ చేపట్టాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. గిరిజనులు తలెత్తుకొని బతికేలా ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చింది ఈ పథకం ద్వారా 6.70లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురానున్నాం,మొత్తం సోలార్ పంపు సెట్లు వినియోగిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. 203031, 2035 నాటికి థర్మల్ విద్యుత్తు కు ఉండే డిమాండ్ దృష్టిలో పెట్టుకొని 50 సంవత్సరాల క్రితం నిర్మించిన రామగుండం, కేటీపీఎస్ థర్మల్ పవర్ స్టేషన్ల స్థానంలో కొత్తవి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ ఏర్పాటుచేసి 50 సంవత్సరాలు పూర్తి కావడంతో 2019 లోనే మూసి వేసాం. అక్కడ 500ఎకరాల స్థలం, బొగ్గు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఎనిమిది వందల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అక్కడ అవకాశం ఉందని డిప్యూటీ సీఎం సూచించారు. 62.5 మెగావాట్ల సామర్థ్యంతో నిజాం కాలంలో ఏర్పాటుచేసిన రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కాలం చెల్లిపోవడంతో మూసి వేసాం. అక్కడే 800 మెగావాట్ల సామర్థ్యంతో థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం తెలిపారు. జెన్కో ఆధ్వర్యంలో థర్మల్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో డైరెక్టర్లు అందుకు తగిన విధంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని రావాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అందరి దృష్టి ప్రస్తుతం తెలంగాణ రెడ్ కో పైనే ఉంది, తెలంగాణ రెడ్ కో దేశానికి రోల్ మోడల్ గా నిలవాలని డిప్యూటీ సీఎం సమావేశంలో ఆకాంక్షించారు. ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా పనిచేసేందుకు రెడ్కోకు కావలసిన సిబ్బంది, ఏ స్థాయి సిబ్బంది కావాలో సవివరంగా ఓ నివేదిక సమర్పించాలని ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి మద్దతు రెడ్ కో కు ఉంటుందని సమావేశంలో డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. డైరెక్టర్లు అందరికీ కావలసినంత స్వేచ్ఛను ఇస్తున్నాం, ప్రభుత్వం ఆశిస్తున్న లక్ష్యాలను పూర్తి చేయండి, విద్యుత్ శాఖ అభివృద్ధికి కావాల్సిన ఆలోచనలు చేయండని డిప్యూటీ సీఎం కొత్తగా నియామకమైన డైరెక్టర్లను కోరారు. దావోస్లో, హైదరాబాదులో, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో చేసుకున్న విద్యుత్ ఉత్పత్తి ఒప్పందలపై రోజువారి సమీక్ష చేయాలని డిప్యూటీ సీఎం ఉన్నతాధికారులను ఆదేశించారు. గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహాలపై సోలార్ పవర్ ప్యానల్స్ ఏర్పాటు చేసి ఆయా వర్గాలకు ఆదాయంతో పాటు, సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన ప్రణాళికలను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఫ్లోటింగ్ సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి నీటిపారుదల శాఖ, జెన్కో రెండు శాఖలను సమన్వయం చేసుకునేందుకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, జెన్కో సి.ఎం.డి హరీష్, రెడ్కో vcmd అనిలా తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి గురించి వివరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్

: **శుభం బన్సల్**

తిరుపతి, జూన్ 27(సమయం న్యూస్): నేటి శుక్రవారం ఉదయం విజయవాడ లోని మురళి ఫార్చూన్ హోటల్ నందు జరిగిన జీఎఫ్ఎస్టీ టూరిజం కాంక్లేవ్లో తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ పాల్గొని తిరుపతి జిల్లా పర్యాటక రంగం గురించి పి.పి.టి ద్వారా వివరిస్తూ..గతేడాది తిరుపతి కి టూరిజంలో భాగంగా సుమారుగా 4 కోట్ల మంది విచ్చేయగా అందులో సుమారు 2.6 కోట్ల మంది తిరుమల దర్శనం చేసుకున్నారని తెలిపారు. సెంటిమెంట్ ఎనాలిసిస్ వ్యవస్థ ద్వారా పర్యాటకులు ఎక్కువగా సందర్శిస్తున్న ప్రదేశాలు, వారికి నచ్చిన విషయాలు, అలాగే అభివృద్ధి చేయాల్సిన అంశాలను గుర్తించామని అన్నారు.ఈ విశ్లేషణ ఆధారంగా పర్యాటక అనుభవాన్ని మరింత మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటున్నామనీ అన్నారు. అంతేకాకుండా పర్యాటక రంగంలో తిరుపతి జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ముందంజలో ఉందని మరింత అభివృద్ధి చెందుటకు తగినన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పర్యాటకులకు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని రాష్ట్రంలోనే కాకుండా దేశం లోనే ముందంజలో నిలిపేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

రాయపోల్, జూన్ 27: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని బిజెపి మండల అధ్యక్షులు దేవుడి లావణ్య నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శేరిపల్లి బందారం గ్రామానికి చెందిన రంగంపేట సత్తయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా విషయం తెలుసుకున్న బిజెపి నాయకులు కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్, భూపాల్ రెడ్డి, స్వామి, గణేష్, కర్ణాకర్, రాజు, మధు, శ్రీశైలం, నర్సింలు, మహేందర్, కర్ణాకర్, నరేష్, రమేష్, భాను, హరీష్, వినోద్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు..

# డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

* **రాష్ట ఎక్సైజ్, పర్యాటక శాఖ జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణా రావు.**




ఆదిలాబాద్ జూన్27(సమయం న్యూస్) : 5k రన్ ను జెండా ఊపి ప్రారంభించిన జూపల్లి కృష్ణారావు ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రొబేషన్ & ఎక్సైజ్, పర్యాటన & సంస్కృతి పురావస్తు శాఖామాత్యులు డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్ అవగాహన వారోత్సవల్లో భాగంగా ఆదిలాబాద్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 5 కే రన్ లో ఎంపీ నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు కలిసి పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా చేపట్టిన సంతకల సేకరణలో సంతకం చేసి, జెండా ఊపి 5 కే రన్ ప్రారంభించి, రన్ లో పాల్గొన్నారు. స్టేడియం నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా . మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించి బ్యానర్లతో అవగాహన కల్పిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వ్యసనంగా మారి యువకుల జీవితాలను నాశనం చేస్తోందన్నారు. అవగాహనతోనే మాదక ద్రవ్యాల నిర్మూలన సాధ్యమని, మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు, యువత, విద్యార్థులు కలిసికట్టుగా ముందడుగు వేయాలని సూచించారు.

# సారూ..మా ఊరు మీదుగా బస్సు నడపండి

రాయపోల్,జూన్27; సారూ మా ఊరు మీదుగా బస్సు సౌకర్యం లేక గ్రామ ప్రజలు,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మా పై దయ ఉంచి బస్సు నడిపించండి..అంటూ లింగారెడ్డి పల్లి విద్యార్థులు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పాండు ను వేడుకుంటున్నారు. రాయపోల్ మండలం లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది విద్యార్థులు గత సంవత్సరం 5 వ తరగతి వరకు గజ్వేల్ లోని ప్రైవేట్ పాఠశాలలో చదివారు.రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం లో బాగంగా ఆ గ్రామానికి వెళ్ళి విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందజేస్తున్న మెరుగైన సౌకర్యాలు,వసతుల గురించి వివరించి రాయపోల్ పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించారు. దీంతో విద్యార్థులు పాఠశాలకు



రావడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గజ్వేల్ రామాయంపేట రూట్ లో వెళ్లే బస్సులలో పాఠశాల సమయంలో ఆరేపల్లి వద్ద నుండి లింగారెడ్డిపల్లి గ్రామం మీదుగా ఒక బస్సును నడుపాలని,అలాగే సాయంత్రం సమయంలో ఒక బస్సును నడపాలని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు,ఉపాధ్యాయులు,నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బస్సు సౌకర్యం కల్పించాలి.

* సిద్దిపేట దిశా మెంబర్. రవీందర్ రెడ్డి.

లింగారెడ్డిపల్లి విద్యార్థుల సౌకర్యార్థం రాయపోల్ పాఠశాలలో చదవడానికి లింగారెడ్డిపల్లి మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సిద్ధిపేట జిల్లా దిశా కమిటీ మెంబర్,బిజెపి నాయకులు బాగాన్నగారి రవీందర్ రెడ్డి శనివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ ను కలిశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగారెడ్డి పల్లి నుండి సుమారు 35 మంది విద్యార్థులు రాయపోలు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్ ను కోరారు. డిపో మేనేజర్ ను కలిసిన వారిలో జర్నలిస్టులు పుట్ట రాజు, ఉషనగళ్ళ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## కాంగ్రెస్ తోనే నిరుపేదలకు మేలు..

రాయపోల్,జూన్27 నిరుపేదల సొంతింటి కల సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ ముంగిసపల్లి గ్రామ అధ్యక్షులు కొన్నింటి రాజు అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం ముంగిసపల్లిలో రమొల్ల సుజాత,రాములు కు సంబంధించిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నిరుపేద సొంత ఇంట్లో నివసించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రతి నిరుపేద కుటుంబాలకి ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శశి,మన్నె రమేష్, నవీన్ పంతులు కుమార్ తదితరులున్నారు.

## హుస్నాబాద్ నియోజక వర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు

# శంకుస్థాపం, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రులు..

హుస్నాబాద్ జూన్27(సమయం న్యూస్) : హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో 11 కోట్ల 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన 50 పడగల మాతా, శిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభించి, 82 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 250 పడకల ప్రభుత్వ వైద్యశాల నిర్మాణ పనుల శంకుస్థాపన మరియు 77 కోట్ల 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో కొత్తపల్లి నుండి హుస్నాబాద్ 2 వరుసల రహదారిని ప్యాకేజ్ 2 ద్వారా 4 వరుసలుగా అభివృద్ధి పరిచే పనుల శంఖుస్థాపన చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య & కుటుంబ సంక్షేమ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మాత్యులు శిలారపు దామోదర రాజనర్సింహ గారు, రాష్ట్ర వ్యవసాయ, సహకార మరియు చేనేత శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు గారు, రాష్ట్ర రోడ్లు & భవనములు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు మరియు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ గారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కే. హైమావతి గారు, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి గారు తదితరులు.



## మంజీరా డ్యాంలో ఎలాంటి పగుళ్లు లేవు

* రాష్ట్ర నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా

సంగారెడ్డి: జంట నగరాలకు తాగునీటిని అందించే మంజీరా డ్యాంకు ఎటువంటి పగుళ్లు లేవని, దాని భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేదని రాష్ట్ర నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రం శివారులోని మంజీరా డ్యాంను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మంజీరా డ్యాం ఆప్రాన్‌లో పగుళ్లు ఏర్పడ్డాయని, అవి ఇప్పటివి కావని.. వాటికి మరమ్మతులకు ఇప్పటికే రూ.3.50 కోట్లు కేటాయించామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన డ్యాంలను డ్యాం సేఫ్టీ అథారిటీతో తనిఖీలు చేయించడం సాధారణమేనన్నారు. వారిచ్చే నివేదికల ఆధారంగా మరమ్మతులు చేపడుతుంటామని చెప్పారు. ఇనుప తాళ్లు తెగిన జూరాల ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో శంకుస్థాపనలు చేసిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టులు ప్రస్తుతం నిర్దేశించుకున్న ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో లేవని స్పష్టం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను దశలవారీగా పూర్తిచేస్తామని వివరించారు. సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్, మెడికల్ కళాశాలలను సందర్శించిన

# రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్,కలెక్టర్

* అందుబాటులో ఉన్న సదుపాయాల పరిశీలన

మహబూబ్ నగర్, జూన్ 27 (సమయం న్యూస్) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజి మానిటరింగ్ కమిటీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంచాలకులు వాసం వెంకటేశ్వర్ రెడ్డి,కలెక్టర్ విజయేందిర బోయి లు శుక్రవారం సందర్శించారు. వివిధ విభాగాలను సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఆసుపత్రిలో ఐ.సీ.యు, ఆర్.ఐ.సీ.యు, ల్యాబ్, బ్లడ్ బ్యాంకు, టీ.హబ్ తదితర వాటిని తనిఖీ చేశారు. వైద్య కళాశాలలో ఫిజియాలజి, అనాటమీ, హెమటాలజి ల్యాబులు, లైబ్రరీ, లెక్చర్ హాల్,సెమినార్ లో,తరగతి గదులు,బాలురు,బాలికల హాస్టల్ లు,డైనింగ్ హాల్,కిచెన్ ఇతర విభాగాలను సందర్శించారు. మౌలిక వసతులు పరిశీలించారు వైద్య కళాశాలలో అధిపతులతో సమావేశమై అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఒక్కో విభాగం వారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్లు,సిబ్బంది ఖాళీలు,అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఇంకనూ కొత్తగా సమకూర్చాల్సిన సదుపాయాలు



తదితర వాటి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు కొత్తగా ఏయే సదుపాయాలు, వైద్య పరికరాలు,యంత్రాలు అవసరం అన్నది గుర్తిస్తూ సమగ్ర నివేదిక సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ లను ఆదేశించారు. ఈ నివేదికను అనుసరిస్తూ సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వానికి ఈ నెల 30 న ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఆసుపత్రి, మెడికల్ కాలేజీల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, తమ దృష్టికి తేవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు సంతృప్తికరంగా వైద్య సేవలు అందించాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. వైద్య కళాశాలలో జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, సూచించారు. వైద్య విద్యార్థులు సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్ లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది ఉండాలన్నారు. ఆయా విభాగాలలో ఖాళీలు ఉంటే, వాటి వివరాలను సమర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ కు సూచించారు. వీరి వెంట మెడికల్ కలశాల డైరెక్టర్ డా.రమేష్, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల సంస్థ ఈ ఈ రవీందర్ రావు,జనరల్ ఆసుపత్రి సూపరింటెండంట్ సంపత్ కుమార్ సింగ్ అధిపతులు ఉన్నారు.



## వావిలాల గ్రామంలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్

జిన్నారం, జూన్ 27, సమయం న్యూస్ ; సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని వావిలాల గ్రామంలో శుక్రవారం కమిషనర్ వెంకటరామయ్య సందర్శించారు. ఈ సందర్భంగా వావిలాల గ్రామంలో ఇంటింటికి ఫీవర్ సర్వే కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది . వావిలాల గ్రామంలో గల ఆర్వో ప్లాంట్ ను పరిశీలించి టిడిఎస్ శాతాన్ని తెలుసుకోవడం జరిగింది. వందరోజుల ప్రణాళికలో భాగంగా రోడ్ సైడ్ చేస్తున్న పనులను పరిశీలించి పలు సూచనలు జారీ చేయడం జరిగింది. వావిలాల నుండి పోతారం వెళ్లే దారిలో గుంతలను పూడ్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది. ఏఎన్ఎం, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ ఎం ఎస్ ఎం ఈ ఇంపాక్ట్ అవార్డ్స్

# 2025 లో భాగంగా ఆంధ్రప్రదేశ్ కు రజత పతకం ప్రధానం

* రాష్ట్ర ఎం.ఎస్.ఎం ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సి.ఈ.ఓ. ఎం.విశ్వ

తిరుపతి, జూన్ 27(సమయం న్యూస్) : దేశవ్యాప్తంగా లక్షకు పైగా MSMEలు నిర్వహించిన సర్వే ప్రచారం మరియు ప్రభుత్వం మరియు పరిశ్రమలకు చెందిన ప్రముఖ నాయకులతో కూడిన జ్యూరీ నిర్వహించిన కఠినమైన దశల ఆధారిత మూల్యాంకన ప్రక్రియ ద్వారా నామినీలను షార్ట్‌లిస్ట్ చేయగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రజత పతకం లభించిందని రాష్ట్ర ఎం.ఎస్.ఎం ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సి.ఈ.ఓ. ఎం.విశ్వ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పతకాన్ని నేషనల్ ఎం ఎస్ ఎం ఈ ఇంపాక్ట్ అవార్డ్స్ 2025 లో భాగంగా ఎం ఎస్ ఎం ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ తరపున రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ అభిషక్తి కిషోర్ ఐ.ఎ.ఎస్. అవార్డును స్వీకరించారన్నారు. ఈ కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం న్యూ ఢిల్లీ లోని లలిత్ హోటల్ లో మాజీ కేంద్ర ఎం ఎస్ ఎం ఈ శాఖా మంత్రి, మాజీ రాజస్తాన్ గవర్నర్ కల్రాజ్ మిశ్రా చేతుల మీదుగా పరిశ్రమల శాఖ డైరెక్టర్ అభిషక్తి కిషోర్ ఐ.ఎ.ఎస్. అవార్డును అందుకున్నారన్నారు. ప్రత్యేక MSME విభాగం ఉనికి, రాష్ట్ర MSME విధానాల నాణ్యత మరియు అమలు, MSME సింగిల్ విండో సిస్టమ్ యొక్క కార్యాచరణ సామర్థ్యం, ఉద్యమం నమోదు ప్రవేశం (జనాభాకు సంబంధించి), MSMEకేంద్రీకృత మౌలిక సదుపాయాలు (చదును చేయబడిన కర్మాగారాలు, పారిశ్రామిక ఎస్టేట్‌లు, పరీక్షా ప్రయోగశాలలు), మహిళలు, SC, ST & OBC వ్యవస్థాపకులను చేర్చడానికి విధాన చర్యలు, రాష్ట్రంలో పనిచేస్తున్న MSMEల నుండి ప్రత్యక్ష అభిప్రాయం మరియు సంతృప్తి రేటింగ్‌లు ఆధారంగా రాష్ట్రాలను విస్తృత శ్రేణి వ్యూహాత్మక మరియు కార్యాచరణ ప్రమాణాలను మూల్యాంకనం చేయడం జరిగిందన్నారు. నేషనల్ ఎం ఎస్ ఎం ఈ ఇంపాక్ట్ అవార్డ్స్ 2025 లో మహారాష్ట్ర కు స్వర్ణ పతకం రాగా, ఆంధ్ర ప్రదేశ్ రజత పతకం, ఉత్తర ప్రదేశ్ కు కాంస్య పతకం దక్కిందని తెలిపారు. ప్రపంచ ఎం ఎస్ ఎం ఈ దినోత్సవం 2025 సందర్భంగా నేషనల్ ఎం ఎస్ ఎం ఈ ఇంపాక్ట్ అవార్డ్స్ 2025 లో భాగంగా రాష్ట్రానికి రజత పతకం లభించినందుకు రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్ అధికారులను అభినందించారు. అలాగే ఎ పి ఎం ఎస్ ఎం ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివ శంకర రావు, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల కార్యదర్శి డా.ఎన్.యువరాజ్, రాష్ట్ర ఎం.ఎస్.ఎం ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సి.ఈ.ఓ. ఎం.విశ్వ సంబందిత అధికారులకు అభినందనలు తెలియజేసినట్లు పై ప్రకటనలో తెలిపారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

రాయపోల్, జూన్ 27: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని బిజెపి మండల అధ్యక్షులు దేవుడి లావణ్య నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శేరిపల్లి బందారం గ్రామానికి చెందిన రంగంపేట సత్తయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా విషయం తెలుసుకున్న బిజెపి నాయకులు కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్, భూపాల్ రెడ్డి, స్వామి, గణేష్, కర్ణాకర్, రాజు, మధు, శ్రీశైలం, నర్సింలు, మహేందర్, కర్ణాకర్, నరేష్, రమేష్, భాను, హరీష్, వినోద్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు..

# జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి గురించి వివరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్

: శుభం బన్సల్



తిరుపతి, జూన్ 27(సమయం న్యూస్): నేటి శుక్రవారం ఉదయం విజయవాడ లోని మురళి ఫార్చ్యూన్ హోటల్ నందు జరిగిన జీఎఫ్ఎస్టీ టూరిజం కాంక్లేవ్‌లో తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ పాల్గొని తిరుపతి జిల్లా పర్యాటక రంగం గురించి పి .పి. టి ద్వారా వివరిస్తూ .. గతేడాది తిరుపతి కి టూరిజంలో భాగంగా సుమారుగా 4 కోట్ల మంది విచ్చేయగా అందులో సుమారు 2.6 కోట్ల మంది తిరుమల దర్శనం చేసుకున్నారని తెలిపారు. సెంటిమెంట్ ఎనాలిసిస్ వ్యవస్థ ద్వారా పర్యాటకులు ఎక్కువగా సందర్శిస్తున్న ప్రదేశాలు, వారికి నచ్చిన విషయాలు, అలాగే అభివృద్ధి చేయాల్సిన అంశాలను గుర్తించామని అన్నారు.ఈ విశ్లేషణ ఆధారంగా పర్యాటక అనుభవాన్ని మరింత మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటున్నామనీ అన్నారు. అంతేకాకుండా పర్యాటక రంగంలో తిరుపతి జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ముందంజలో ఉందని మరింత అభివృద్ధి చెందుటకు తగినన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పర్యాటకులకు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని రాష్ట్రంలోనే కాకుండా దేశం లోనే ముందంజలో నిలిపేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. అదనంగా, WhatsApp ఆధారిత సూచనలు, వర్చువల్ రియాలిటీ (VR), ఆల్టర్నేట్ రియాలిటీ (AR), AI వంటి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అనుభవాలను అందిస్తున్నామని మరియు ఇంటి వద్ద కూర్చొన్న వారు కూడా మన ప్రాంతీయ వారసత్వాన్ని ఈ విధంగా అనుభవించగలుగుతున్నారని తెలిపారు. పర్యాటకుల భద్రత కోసం అత్యవసర SOS ఫీచర్లను కూడా ప్రవేశపెడుతున్నామని అన్నారు. మన రాష్ట్రం భౌగోళికంగా గొప్ప సంపదను కలిగి ఉందని, ప్రాచీన దేవాలయాలు, కోటలు మరియు గౌ. ముఖ్యమంత్రి గారి మార్గదర్శనంలో ప్రారంభమైన కాలానుగుణ అభివృద్ధి కార్యక్రమాలు దీనికి నిలువెత్తు సాక్ష్యాలని, వీటిని నూతన సాంకేతికతతో సమర్పించేందుకు మేము సంకల్పబద్ధంగా పనిచేస్తున్నామని అన్నారు.




## మొట్టమొదటి ఈ ఓటింగ్ పైలట్ ప్రారంభం

* ఇక నుండి ఓటు హక్కు వినియోగం సులభతరం.
* బీహార్ జూన్,27(సమయం న్యూస్) : బక్సర్ మున్సిపల్ ఉప ఎన్నికల కోసం జూన్ 28న బీహార్‌లో భారతదేశపు మొట్టమొదటి మొబైల్ ఈఓటింగ్ పైలట్ ప్రారంభం..
* ఓటర్లు CDAC మరియు రాష్ట్ర ఎన్నికల సంఘం అభివృద్ధి చేసిన సురక్షితమైన Android యాప్‌ల ద్వారా ఓట్లు వేయవచ్చు..
* లక్షణాలు: బ్లాక్‌చెయిన్, ముఖ గుర్తింపు, ఎన్‌క్రిప్టెడ్ ఓట్లు, VVPATశైలి ఆడిట్..

వలసదారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న & విభిన్న శక్తులు ఉన్న ఓటర్ల కోసం లక్ష్యంగా పెట్టుకుంది..



## మెదక్,రామాయణం పట్టణంలో అభివృద్ధికి కృషి..

* మెదక్ ఎమ్మెల్యే మైనం పల్లీ రోహిత్ రావు.

మెదక్ జూన్27(సమయం న్యూస్) : మెదక్,రామాయంపేట,మున్సిపాలిటీలు అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ హాలులో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, మెదక్ రామయంపేట్ మున్సిపల్ కమిషనర్స్, మున్సిపల్ డీఈలు,తో కలిసి పట్టణ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే మైనంపల్లి సమీక్ష నిర్వహించారు. నేపథ్యంలో 32 వార్డులలో గల సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివిధ శాఖలతో అధికారులతో కలిసి ఒకరికొకరు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా డ్రైనేజీ,రోడ్లపై ప్రత్యేక దృష్టి సాధించామని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. వార్డుల్లో ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో మున్సిపల్ తాజా,మాజీ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే సమీక్షించి వార్డుల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హవేలిగన్పూర్ తాసిల్దార్. సింధూ రేణుక, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# సున్నం చెరువు నీటితో ఆరోగ్యానికి కన్నం

* నీటి ట్యాంకర్లతో కలుషిత జలాల సరఫరా
* విద్యార్థుల ప్రాణాలతో వ్యాపారుల చెలగాటం
* నీటి నమూనాలను PCB కి పంపిన హైడ్రా
* పీసీబీ పరిశోధనలో వెల్లడైన నిజం
* ట్యాంకర్ల నిర్వాహకులపై హైడ్రా కేసులు

హైదరాబాద్, జూన్ 27(సమయం న్యూస్) : మాధాపూర్లోని సున్నం చెరువు చెంత బోర్లు వేసి.. ఆ నీటితో ప్రజల ఆరోగ్యానికి కన్నం పెడుతున్నారు ఇక్కడి నీటి వ్యాపారులు. అక్రమంగా బోర్లు వేసి.. కలుషిత జలాలతో మాధాపూర్ పరిసరాల్లో ఉన్న హాస్టళ్ల విద్యార్థుల భవిష్యత్తు అనారోగ్యం పాలు చేస్తున్నారు. ఐఐటీతో పాటు.. వైద్య విద్యనభ్యశించడానికి ఉత్తమ ర్యాంకులు రావాలని ఆశిస్తూ అహర్నిశలూ కష్టపడుతున్న విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. సున్నం చెరువు చెంతకు వెళ్తేనే దుర్వాసన భరించలేం. ఇలాంటి చోట బోర్లు వేసి ఆ నీటిని తాగునీటిగా మాధాపూర్ పరిసరాల్లోని విద్యా సంస్థలు, వసతి గృహాలు, హోటళ్లకు సరఫరా చేసి ప్రాణాలమీదకు తెస్తున్నారు.

* పీసీబీ ద్వరా నీటి నాణ్యత పరీక్షలు..

ఈ చెరువును పునరుద్ధరించే క్రమంలో హైడ్రా.. ఇక్కడి భూగర్భ జలాలు ఎంతటి ప్రమాదకర స్థాయిలో ఉన్నాయో అనే అంశాన్ని పీసీబీ (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) ద్వారా పరీక్షించింది. తాగునీటిగా సరఫరా చేస్తున్న ట్యాంకర్లలోని నీటి నమూనాలపై అధ్యయనం చేయించింది. సీసం, కాడ్మియం, నికెల్ లోహాల మోతాదులు అధికంగా ఉన్నాయని ఈ పరిశోధనల్లో వెల్లడైంది. ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పీసీబీ హెచ్చరించింది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన మోతాదులో కాకుండా.. రెండింతలు, మూడింతలు, 12 రెట్లు అధికంగా ఉండి ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయని పీసీబీ పరిశోధనల్లో వెల్లడైంది.

* 12 రెట్లు అధికంగా సీసం (Lead -Pb)..

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక లీటరు నీటిలో 0.01 మిల్లీగ్రాముల సీసం (Lead Pb) వరకూ ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కాని సున్నం చెరువు చుట్టూ ఉన్న బోరు నీటిలో 0.073 0.122 ఉన్నట్టు పీసీబీ గుర్తించింది. అంటే అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఫర్వాలేదు అనుకునే స్థాయిలో 7 నుంచి 12 రెట్లు అధికంగా ఉన్నట్టు వెల్లడైంది. దీంతో పిల్లల మెదడు చురుకుతనంపై ప్రభావం చూపుతోంది. జ్ఞాపిక శక్తిని తగ్గిస్తుంది. రక్తహీనతకు కారణమవ్వడమే కాకుండా.. బాల్యం, యవ్వన దశలోనే కిడ్నీలపై ప్రభావం చూపుతుంది. రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు,సంతానోత్పత్తిపైనా ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు.

* 2 నుంచి 3 రెట్లు అధికంగా కాడ్మియం(Cadmium -Cd)...

కాడ్మియం 0.003 వరకూ ఫర్వాలేదు అని అంతర్జాతీయ ప్రమాణాలు చెబుతున్నాయి. అయితే సున్నం చెరువు పరిసరాల్లోని బోరు వాటర్లో 0.007 0.010 ఉన్నట్టు వెల్లడైంది. 2 3 రెట్లు అధికం ఉంది. అధిక మొత్తంలో ఉన్న కాడ్మియం మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది. మూత్రం ద్వారా ప్రొటీన్లు పోవడంతో ఎముకుల బలహీనతకు దారి తీస్తుంది. క్యాన్సర్ వ్యాధికి కారణమౌతుందని ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ వెల్లడించింది.



* రెండురెట్లు అధికంగా నికెల్ (Nickel Ni)...

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక లీటరు నీటిలో 0.02 మిల్లీగ్రాముల మోతాదులో నికెల్ ఉంటే ఫర్వాలేదు. కాని సున్నం చెరువు చెంత ఉన్న బోర్లలో 0.038 0.046 అధికంగా ఉన్నట్టు వెల్లడైంది. అంటే 2 రెట్లు అధికంగా ఉన్నట్టు వెల్లడైంది. మనం తాగే నీటిలో నికెల్ ఎక్కువ ఉంటే.. చర్మ సంబంధిత వ్యాధులతో పాటు.. కాలేయం దెబ్బతింటోంది. తద్వారా మూత్రపిండాలు దెబ్బతింటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధిక ఒత్తిడికి గురై చిన్న వయసులోనే రక్తపోటుకు కూడా కారణమౌతుందని వైద్యులు చెబుతున్నారు.

* మరగబెట్టినా వదలని కాలుష్యం..

సహజంగా నీటిని మరగబెట్టి తాగండి అంటారు.. కాలుష్య సాగరాల చెంత ఉన్న బోర్ల నుంచి వచ్చే నీటిని మరగబెట్టి వినియోగించినా ప్రయోజనం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇందులో శూక్ష్మక్రిములు నశించినా.. సీసం, కాడ్మియం, నికెల్ వంటి భార లోహాలు కరగకపోగా... మరింత దగ్గరగా మారి ప్రమాదకరంగా పరిణమిస్తాయని హెచ్చరిస్తున్నారు. సున్నం చెరువు చెంతనే కాకుండా.. నగరంలోని కాలుష్య సాగరాలు, మురుగు కాలువల చెంత ఉన్న నివాస ప్రాంతాల్లోని భూగర్భ జలాలంతలెక్కా ఇదే పరిస్థితి ఉందని పీసీబీ పరిశోధనల ద్వార వెల్లడైంది. సున్నం చెరువు చెంత బోరు నీటిని తాగునీటి అవసరాలకు అమ్ముతున్నవారిపై పోలీసు కేసులు కూడా హైడ్రా పెట్టించింది.

* సున్నం చెరువుకు మొదటి ప్రాధాన్యం

ఇంతటి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నందునే హైడ్రా సున్నం చెరువు పునరుద్ధరణకు మొదటి ప్రాధాన్యతనిచ్చింది. నగరంలో చేపడుతున్న 6 చెరువుల (మాధాపూర్లోని సున్నం చెరువు, తమ్మిడికుంట, కూకట్పల్లి నల్లచెరువు, ఉప్పల్లోని నల్లచెరువు, అంబర్పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమ్రుక్ నుద్దౌలా చెరువు) పునరుద్ధరణలో సున్నం చెరువు ఉంది. శేరిలింగంపల్లి, కూకట్పల్లి మండలాల సరిహద్దులోని గుట్టల బేగంపేట, అల్లాపూర్ గ్రామాల మధ్య సున్నం చెరువు 32.60 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువును కాలుష్యం నుంచి కాపాడి.. మంచి నీరు నిలిచేలా దాదాపు రూ. 10కోట్లతో హైడ్రా అభివృద్ధి చేస్తోంది.

# కృష్ణ గోదావరి నది జలాల లో న్యాయం జరిగే అంత వరకు పోరాటం

* ఇరిగేషన్ శాఖ పై గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సంవత్సరానికి 16000 కోట్ల మిత్తి కడుతున్నాం......
* రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది....
* ఎత్తి పోతల పథకాల పనులు వేగవంతంగా, నాణ్యతగా జరగాలి.....
* జానపాడు, బెట్టే తండా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ పూర్తి అయితే పాలకీడు మండలం సస్యశ్యామలం అవుతు సర్వతోముఖాభివృద్ధి చెందుతుంది.......
* రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి
* నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట జూన్27(సమయం న్యూస్) : కృష్ణ, గోదావరి జలాల పంపకంలో గత పాలకుల అశ్రద్ధ వల్ల తెలంగాణ రైతాంగానికి అన్యాయం జరిగిందని దానిని సరి చేసేందుకు మేము పోరాడుతున్నామని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పాలకీడు మండలం పాలకీడు మండలం జానపాడు గ్రామంలో కృష్ణ నది పై నిర్మిస్తున్న జవహర్ జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్,బెట్టేతండా గ్రామంలో మూసీనది పైన నిర్మిస్తున్న బెట్టేతండ స్కీం పనులను ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు పదేళ్ల నిర్లక్ష్యం చేయటంతో కృష్ణ నదిలో 811 టి యమ్ సి లలో ఆంధ్ర కి 599 టి యమ్ సి లు, తెలంగాణాకి 299 టి యమ్ సి లకి వ్రాత పూర్వకంగా ఒప్పుకున్నారని కానీ మేము వచ్చాక నది పరివాహక ప్రాంతం,ఆయకట్టు, జనాభా ను పరిగణనలోకి తీసుకొని నీటి కేటాయింపులు చేయాలనీ పోరాడుతున్నామని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మడి హట్టి వద్ద 38000 కోట్లతో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ ని ప్రారంభిస్తే కమిషనలకి కక్కుర్తి పడి లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం పేరుతో నిర్మిస్తే మూడేళ్ళకే కూలిపోయిందని అదే తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మిస్తే 62000 కోట్ల రూపాయలు మిగిలేవి అని వాటితో ఎస్ ఎల్ బి సి, డిండి,



పాలమూరు రంగారెడ్డి, భీమా, నెత్తంపాడు, కోయిల సాగర్, దేవాదుల, సీత రామ సాగర్, గౌరెల్లి, లాంటి ప్రాజెక్టు లు పూర్తి అయి నేడు తెలంగాణ సస్యాశ్యామలం అయ్యేదన్ని కానీ ఇరిగేషన్ శాఖపై వారు చేసిన తప్పిదాల వల్ల నేడు మేము 16000 కోట్ల రూపాయలు వడ్డీ చెలిస్తున్నామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి 27,500 కోట్లు, సీతారామ ప్రాజెక్ట్ 10,000 కోట్లు ఖర్చు చేసిన ఒక ఎకరం కొత్త ఆయకట్టు లోకి తీసుకొని రాలేదని అన్నారు.మేము ప్రభుత్వం ఏర్పాటు చేసాక ముఖ్యమంత్రి, నేను నీటిపారుదల శాఖ లో జరిగిన తప్పిదాలను ఒక్కొకటి సరి చేసుకుంటూ కాళేశ్వరం నీరు ఇవ్వకున్నా తెలంగాణ లో ఖరీఫ్, రబీ సీజన్ లలో కలిపి 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పడించి దేశం లోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని అలాగే ముందస్తుగా రైతు లకి పెట్టుబడి కొరకు 9 రోజులలో 9000 కోట్లు రైతు భరోసా కింద వేయటం జరిగిందని తెలిపారు. జవహర్ జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు యుద్ధ ప్రాతిపదికన వేగవంతంగా, నాణ్యత పాటిస్తూ పూర్తి చేయాలని మంత్రి కాంట్రాక్టర్ ని ఆదేశించారు. పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని ఇప్పటికే మూడు సార్లు సందర్శించిన పనులలో పురోగతి లేదని కాంట్రాక్టర్ పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ను 302 కోట్ల రూపాయలతో నిర్మించటం జరుగుతుందని దీని ద్వారా అలింగాపురం,రాఘవపురం, బొత్తలపాలెం, కోమటికుంట,మీగడం పాడు తండా, చెరువు తండా, హనుమాయగూడెం, పాలకీడు, సజ్జాపురం, నాగిరెడ్డి గూడెం గ్రామాలలోని 10,000 ఎకరాలకి సాగునీరు అలాగే జానపాడు చెరువు కి నీరు అందించటం జరుగుతుందని తెలిపారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం

* 200 కోట్ల తో 55 పాఠశాల నిర్మాణానికి ఆమోదం.

హైదరాబాద్ జూన్ 27(సమయం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల విద్యార్థుల భవిష్యత్‌ను మెరుగుపరచేందుకు ప్రభుత్వం "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (YIIRS)" ప్రాజెక్టును చేపట్టింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ మేరకు ఇప్పటివరకు రూ.200 కోట్లు ఖర్చుతో 55 పాఠశాలల నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ పాఠశాలలు అంతర్జాతీయ ప్రమాణాల విద్యను అందించనున్నాయి. ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించాల్సిందిగా కేంద్ర మంత్రి శ్రీ రాందాస్ గారికి రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు విజ్ఞప్తి చేశారు.

## జిల్లా ఆరోగ్య వ్యవస్థపై సమీక్ష నిర్వహించిన రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్

నిర్మల్ జూన్27(సమయం న్యూస్) : జిల్లా పర్యటనలో భాగంగా నిర్మల్‌కు శుక్రవారం విచ్చేసిన రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ డా. ఆయేషా మస్రత్ ఖానం కు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ లు కలెక్టర్ ఛాంబర్ లో పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య వ్యవస్థ, నూతనంగా ప్రారంభించిన ఆరోగ్య కార్యక్రమాలు,



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, అలాగే భవిష్యత్‌లో చేపట్టవలసిన అంశాలపై సమగ్రంగా చర్చించారు.

సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
www.samayamdaily.net



# ఫోన్ ట్యాపింగ్ విచారణ ఏమైనా డైలీ సీరియలా? : ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం

* దుబ్బాక నుంచే ఫోన్ ట్యాపింగ్ ప్రారంభం
* మొట్టమొదట తన ఫోనే ట్యాప్ అయిందని వెల్లడి
* సిట్ దర్యాప్తు ఓ డైలీ సీరియల్ అంటూ విమర్శ
* కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటయ్యాయని ఆరోపణ
* అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్పుపై తీవ్ర ఆగ్రహం
* ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకే ఇచ్చారంటూ ఆగ్రహం



తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసుపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సిట్ దర్యాప్తు ఒక డైలీ సీరియల్‌లా సాగుతోందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ దుబ్బాక ఉపఎన్నికతోనే ప్రారంభమైందని, తాను మొదటి బాధితుడినని తెలిపారు. "దుబ్బాక ఉపఎన్నిక సమయంలో నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అప్పుడే డీజీపీకి ఫిర్యాదు చేశాను. కానీ ఇప్పటివరకు నా నుంచి వివరాలు తీసుకోలేదు. ఫిర్యాదు చేసిన నన్ను కాదని, సంబంధం లేని వ్యక్తులను సిట్ విచారణకు పిలుస్తోంది. మమ్మల్ని అడిగితే అన్ని ఆధారాలు ఇచ్చేవాళ్ళం కదా?" అని రఘునందన్ ప్రశ్నించారు. ఈ కేసు విచారణలో చివరికి గాడిద గుడ్డు తప్ప ఏమీ తేలదని ఆయన అన్నారు.

**కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని రఘునందన్ రావు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా పాలన సాగిస్తోందని మండిపడ్డారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఫిర్యాదు చేస్తే నియోజకవర్గానికి వెళ్ళినప్పుడు సమాచారం ఇస్తే భద్రత కల్పిస్తామని పోలీసులు చెప్పారని ఆయన తెలిపారు.

పథకాల పేర్లు మార్చడంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్నపూర్ణ క్యాంటీన్ల పేరును 'ఇందిరమ్మ'గా మార్చడం దౌర్భాగ్యమని అన్నారు. "ఇందిరమ్మ పేరు చెబితే ఎమర్జెన్సీ గుర్తుకు వస్తుందనే కనీస ఇంగితజ్ఞానం కూడా కాంగ్రెస్ నేతలకు లేదు. మేయర్ ఇప్పటికైనా పేర్లు మార్చడంపై కాకుండా నగరంలో కుక్కల బెడద వంటి సమస్యలపై దృష్టి పెట్టాలి" అని హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్ళు కూడా అర్హులైన పేదలకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకే దక్కాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలోనైనా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చారని నిరూపించాలని సవాల్ విసిరారు.

**బీఆర్ఎస్‌పైనా విమర్శనాస్త్రాలు**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కవితపై కూడా రఘునందన్ రావు స్పందించారు. "కవిత బీసీనా? పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా? పార్టీ అధ్యక్ష పదవి, శాసనసభాపక్ష నేత పదవి బీసీలకు ఇవ్వకుండా ఇప్పుడు బీసీ ఉద్యమం చేస్తామంటే ఎలా?" అని ప్రశ్నించారు. మతపరమైన రిజర్వేషన్లు తొలగిస్తే రాజ్యాంగ సవరణకు తాము సిద్ధంగా ఉన్నామని రఘునందన్ రావు స్పష్టం చేశారు.




# అన్నపూర్ణ భోజన కేంద్రాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

* త్వరలో రూ.5కే అల్పాహారం కూడా ప్రారంభం
* నాణ్యమైన భోజనం అందించేందుకు మెనూలో మార్పులు
* తాత్కాలిక షెడ్ల స్థానంలో శాశ్వత భవనాల నిర్మాణం

హైదరాబాద్ పేదలు, శ్రామికుల ఆకలి తీరుస్తున్న రూ.5 అన్నపూర్ణ భోజన కేంద్రాలు సమూల మార్పులకు సిద్ధమవుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) స్టాండింగ్ కమిటీ తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం, ఈ కేంద్రాల పేరును 'ఇందిరా క్యాంటీన్లు'గా మార్చనున్నారు. కేవలం పేరు మార్పుకే పరిమితం కాకుండా, సేవలను విస్తరించి, సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు చేపట్టబోతున్నారు. ప్రస్తుతం మధ్యాహ్నం మాత్రమే భోజనం అందిస్తున్న ఈ కేంద్రాల్లో, త్వరలోనే రూ.5కే ఉదయం అల్పాహారం కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకు మరింత పౌష్టికాహారం అందించే లక్ష్యంతో భోజనం మెనూను కూడా మార్పు చేస్తున్నారు. కొత్త మెనూ ప్రకారం, ప్రతి ప్లేట్‌లో 400 గ్రాముల అన్నం, 120 గ్రాముల సాంబార్, 100 గ్రాముల కూర, 15 గ్రాముల పచ్చడి ఉండేలా చూస్తారు. ప్రస్తుతం చాలా అన్నపూర్ణ కేంద్రాలు తుప్పు పట్టిన రేకుల షెడ్లలో, పాడుబడిన గదుల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, వాటిని శాశ్వత భవనాల్లోకి మార్చాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసి, నివేదిక ఆధారంగా పనులు చేపట్టనుంది. భవిష్యత్తులో ఏర్పాటు చేసే క్యాంటీన్లతో పాటు, ప్రస్తుత కేంద్రాల్లో కూడా ప్రజలు కూర్చుని తినేందుకు వీలుగా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని యోచిస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కిరణ్ కుమార్ రెడ్డి ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అన్నపూర్ణ కేంద్రాలను ప్రారంభించింది. ఆ తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేంద్రాల సంఖ్యను పెంచినప్పటికీ, పేరును మాత్రం మార్చలేదు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ కేంద్రాలకు దివంగత ప్రధాని ఇందిరా గాంధీ పేరు పెట్టాలని నిర్ణయించింది. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు దాదాపు 10 కోట్ల భోజనాలను పేదలకు అందించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా, కరోనా లాక్‌డౌన్ సమయంలో లక్షలాది మంది వలస కార్మికులు, పేదల ఆకలిని ఈ క్యాంటీన్లు తీర్చాయని గుర్తుచేశారు. ఈ మార్పులతో ఇందిరా క్యాంటీన్లు నగర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో మరో ఫ్లైఓవర్..
# ప్రారంభానికి ముందే కేటీఆర్ ఆసక్తికర ట్వీట్

* శనివారం గచ్చిబౌలి-కొండాపూర్ ఫ్లైఓవర్ ప్రారంభం
* ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
* ఫ్లైఓవర్‌కు కాంగ్రెస్ నేత పీజేఆర్ పేరు ఖరారు
* ఇది తమ ప్రభుత్వ ఘనతేనన్న మాజీ మంత్రి కేటీఆర్
* ఎస్ఆర్డీపీ కింద 36 ఫ్లైఓవర్లు మేమే కట్టామన్న కేటీఆర్
* మిగిలినవి పూర్తి చేయాలంటూ కాంగ్రెస్‌పై సెటైర్లు



హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం కలిగించేందుకు మరో కీలక ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు నిర్మించిన ఈ మల్టీ లెవెల్ ఫ్లైఓవర్‌ను శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అయితే ఈ ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందు, ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఫ్లైఓవర్ నిర్మాణం క్రెడిట్ తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తూనే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**పీజేఆర్ ఫ్లైఓవర్‌గా నామకరణం**

శనివారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్న ఈ ఫ్లైఓవర్‌కు, దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత పి. జనార్ధన్ రెడ్డి గౌరవార్థం "పీజేఆర్ ఫ్లైఓవర్"గా నామకరణం చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఇది మా ప్రభుత్వ ఘనత: కేటీఆర్**

ఈ ఫ్లైఓవర్ ప్రారంభంపై కేటీఆర్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్డీపీ) కింద నిర్మించిన మరో కీలక ప్రాజెక్టు అందుబాటులోకి రావడం గర్వంగా, సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ పౌరుల తరఫున మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. తమ పదేళ్ల పాలనలో హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు 42 ఫ్లైఓవర్లకు ప్రణాళికలు రూపొందించామని, వాటిలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని కేటీఆర్ గుర్తుచేశారు. మరో 6 ప్రాజెక్టులు 2024 నాటికి పూర్తి కావాల్సిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. "మిగిలిన ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం వారి పాలనాకాలం పూర్తయ్యేలోపు అయినా పూర్తి చేయాలని కోరుకుంటున్నాను" అంటూ ఎద్దేవా చేశారు.

# మావోయిస్టుల ఆరోపణలపై మంత్రి సీతక్క స్పందన

* మావోల ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి
* జీవో 49ను తాను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నానని స్పష్టం
* ఆదివాసుల జోలికి వెళ్లొద్దని అటవీ అధికారులకు ఆదేశాలిచ్చామన్న సీతక్క



ఆదివాసీల హక్కుల విషయంలో మావోయిస్టులు చేసిన ఆరోపణలపై తెలంగాణ మంత్రి సీతక్క స్పందించారు. తన మూలాలను తాను ఎన్నడూ మరచిపోలేదని, ఆదివాసీల పక్షాన నిలబడతానని ఆమె స్పష్టం చేశారు. ములుగులో విలేకరులతో మాట్లాడిన ఆమె, మావోయిస్టులు తనపై చేసిన విమర్శలను ఖండించారు. ఎవరైనా సరే వాస్తవాలు మాట్లాడాలని మావోయిస్టులకు పరోక్షంగా హితవు పలికారు. వివాదాస్పదంగా మారిన జీవో నంబర్ 49ను తాను వ్యతిరేకించిన విషయాన్ని మంత్రి సీతక్క గుర్తుచేశారు. "ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే జీవో 49ను నేను వ్యతిరేకించాను. ఈ విషయంపై మా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమై చర్చించాను. అడవిలో ఆదివాసుల జోలికి వెళ్లవద్దని, వారిని ఇబ్బంది పెట్టవద్దని నేను, మరో మంత్రి కొండా సురేఖ కలిసి అటవీశాఖ అధికారులకు చాలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం" అని ఆమె వివరించారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఒకరిద్దరు అధికారులు మాత్రమే నిబంధనలు అతిక్రమిస్తున్నారని, మిగతా వారెవరూ ఆదివాసీలను ఇబ్బంది పెట్టడం లేదని ఆమె తెలిపారు. అంతకుముందు, మావోయిస్టులు మంత్రి సీతక్కకు ఒక లేఖ రాశారు. ఒకప్పుడు ఉద్యమంలో పనిచేసిన సీతక్క, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉండి ఆదివాసీల హక్కులను గాలికొదిలేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కుల ఉల్లంఘనకు ఆమెదే పూర్తి బాధ్యత అని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా, కుమురం భీమ్ జిల్లాలో 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం జీవో 49ను తీసుకొచ్చిందని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేందుకే ఈ జీవోను రూపొందించారని విమర్శించారు. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి తన వైఖరిని స్పష్టం చేశారు.

# తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ : రేపటి నుంచే స్లాట్ బుకింగ్ ప్రారంభం

* తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల
* మొత్తం మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ పూర్తి
* శనివారం నుంచి జులై 7 వరకు స్లాట్ బుకింగ్‌కు అవకాశం
* జులై 18 నాటికి తొలి దశ సీట్ల కేటాయింపు పూర్తి
* జులై 25 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోరుకుంటున్న విద్యార్థుల కోసం ఒక ముఖ్యమైన ప్రకటన వెలువడింది. తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ సంవత్సరం ప్రవేశ ప్రక్రియను మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా, స్లాట్ బుకింగ్ ప్రక్రియ శనివారం (జూన్ 28) ప్రారంభమై జులై 7వ తేదీ వరకు కొనసాగుతుంది. విద్యార్థులు తమకు అనువైన స్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత, జులై 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. విద్యార్థులు ఎంచుకున్న ఆప్షన్ల ఆధారంగా, జులై 14, 15 తేదీల్లో మాక్ సీట్ల కేటాయింపు ఉంటుంది. జులై 18వ తేదీలోపు మొదటి విడత సీట్లను కేటాయించి ప్రవేశ ప్రక్రియను పూర్తి చేస్తారు. మొదటి విడత కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత, రెండవ విడత ప్రక్రియను జులై 25 నుంచి ప్రారంభించనున్నారు. రెండవ విడతలో భాగంగా జులై 26న ధృవపత్రాల పరిశీలన ఉంటుంది. అదేవిధంగా, జులై 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు విద్యార్థులకు అవకాశం ఇస్తారు.

# విషయం లేనందువల్లే రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారు

: **హరీశ్ రావు**



బనకచర్ల ప్రాజెక్ట్ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) పేరుతో సీఎం కేవలం కాలయాపన చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ పీపీటీ కేవలం కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల కోసమే ఇచ్చారని, ఇది ఓ నాటకమని మండిపడ్డారు. 2016 నాటి అజెండా మినిట్స్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆనాటి సమావేశంలో మాజీ సీఎం కేసీఆర్ కేవలం ఇరు రాష్ట్రాలు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే అన్నారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ ప్రతిపాదననూ ఒప్పుకునేది లేదని కేసీఆర్ ఆనాడే స్పష్టం చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో, బనకచర్ల విషయంపై జరగబోయే కేంద్ర జలశక్తి సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తన వాదనలను బలంగా వినిపించాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం లేనందువల్లే సీఎం రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారని హరీశ్ రావు విమర్శించారు. "బేసిన్‌కు, బాసిన్‌కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి" అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసిందని అన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల కార్పొరేషన్ ఏర్పాటు కాలేదని, టెండర్లు కూడా పిలవలేదని ఆయన స్పష్టం చేశారు.

# రిషభ్ పంత్ సమాధానం విని షాకయ్యా

:అజయ్ జడేజా



రిషభ్ పంత్ టీమ్ఇండియా తరఫున ఉత్తమ టెస్ట్ క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. ఇంగ్లాండ్‌తో లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అద్భుత రీతిలో సెంచరీలు సాధించాడు. ఈ ఫీట్ సాధించిన తొలి ఆసియా, మొదటి భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. బ్యాటింగ్‌లోనే కాదు, అతడి తీరులోనూ ఆత్మవిశ్వాసం ఉంటుంది! అందుకే కారు ప్రమాదానికి గురై పునరాగమనం చేసిన తర్వాత కూడా ఏ మాత్రం తడ'బ్యాటు' లేకుండా తిరిగి సత్తా చాటుతున్నాడు. పంత్‌కు తనమీద తనకున్న నమ్మకాన్ని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ అజయ్ జడేజా వివరించాడు. రిషభ్‌పంత్‌కు సుమారు 18 సంవత్సరాల వయసున్నప్పుడు 2015 16 సీజన్‌లో అతణ్ని దిల్లీ తరఫున రంజీ ట్రోఫీకి సెలక్టర్లు ఎంపిక చేయలేదు. ఆ సమయంలో అజయ్ జడేజా దిల్లీ జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్నాడు. రంజీ ట్రోఫీ జట్టులో పంత్‌కు చోటు దక్కకపోయినా, ట్రైనింగ్ సెషన్‌కు హాజరు కావాలని తాను అతణ్ని కోరినట్లు జడేజా వెల్లడించాడు. అయితే, పంత్ ఇచ్చిన సమాధానం తనని ఆశ్చర్యపరిచిందని చెప్పాడు. ''నేను 2015లో కొన్ని రోజులు దిల్లీ కోచ్‌గా ఉన్నాను. సెలక్టర్లు పంత్‌ను రంజీట్రోఫీకి దిల్లీ జట్టు తరఫున ఎంపిక చేయలేదు. అయినా ప్రాక్టీస్ సెషన్‌కు హాజరు కావాలని నేను పంత్‌కు చెప్పాను. ప్రస్తుతం ఎంపిక కాకపోయినా ఫర్వాలేదు.. భవిష్యత్తులో అవకాశం ఉంటుందని చెప్పా. దానికి అతడు.. ''ఏం ఫర్వాలేదు. వారికి నా అవసరం పడినప్పుడు.. వారే నన్ను ఇంటి నుంచి తీసుకువెళతారు'' అని పంత్ సమాధానం చెప్పాడు. అది విని నేను షాకయ్యా' అని జడేజా గుర్తు చేసుకున్నాడు. తర్వాత పంత్ అనూహ్యంగా ఆ సీజన్‌లోనే జట్టులో అడుగు పెట్టాడు. అరంగేట్ర మ్యాచ్‌లోనే అర్ధ సెంచరీ సాధించాడు.

# టీ20 క్రికెట్‌లో కొత్త రూల్స్.. పవర్‌ప్లేకు పక్కా లెక్క..!

* **టీ20, టెస్ట్ క్రికెట్‌లో కొత్త నిబంధనలు ప్రకటించిన ఐసీసీ**
* **వర్షం వల్ల కుదించిన టీ20 మ్యాచ్‌లకు కొత్త పవర్‌ప్లే లెక్కలు**
* **ఇకపై పాయింట్లలోనూ పవర్‌ప్లే ఓవర్ల లెక్కింపు**
* **టెస్టుల్లో స్లో ఓవర్ రేట్‌ను అరికట్టేందుకు స్టాప్ క్లాక్ విధానం**
* **జూలై నుంచి అమల్లోకి రానున్న టీ20 నిబంధనలు**



ఐసీసీ కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. టీ20, టెస్ట్ ఫార్మాట్లలో ఆటను మరింత పారదర్శకంగా, వేగంగా మార్చేందుకు కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా వర్షం లేదా ఇతర కారణాలతో ఓవర్లను కుదించిన టీ20 మ్యాచ్‌లకు సంబంధించి పవర్‌ప్లే ఓవర్లపై స్పష్టతనిచ్చింది. అలాగే టెస్టుల్లో స్లో ఓవర్ రేట్ సమస్యను అరికట్టేందుకు స్టాప్ క్లాక్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. టీ20ల్లో మారిన పవర్‌ప్లే లెక్కలు

ఇకపై కుదించిన టీ20 మ్యాచ్‌లలో పవర్‌ప్లే ఓవర్లను రౌండ్ ఫిగర్ కాకుండా, కచ్చితమైన లెక్కల ఆధారంగా నిర్ణయిస్తారు. ఇప్పటివరకు 8 ఓవర్ల మ్యాచ్‌కు మూడు ఓవర్ల పవర్‌ప్లే ఉండేది. కానీ కొత్త నిబంధనల ప్రకారం 8 ఓవర్ల ఇన్నింగ్స్‌లో 2.2 ఓవర్లు మాత్రమే పవర్‌ప్లేగా ఉంటుంది. ఈ సమయంలో 30 గజాల సర్కిల్ బయట ఇద్దరు ఫీల్డర్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఈ మార్పుల వల్ల మ్యాచ్ నిడివి ఎంత ఉన్నా, ఫీల్డింగ్ పరిమితుల విషయంలో అన్ని జట్లకు సమాన అవకాశాలు లభిస్తాయని ఐసీసీ భావిస్తోంది. ఈ కొత్త పవర్‌ప్లే నిబంధనలు జూలై నుంచి అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లకు వర్తిస్తాయని ఐసీసీ స్పష్టం చేసింది.

* **కొత్త నిబంధనల ప్రకారం వివిధ ఓవర్ల మ్యాచ్‌లకు పవర్‌ప్లే ఇలా..**

| | |
|---|---|
| 5 ఓవర్ల మ్యాచ్‌కు: | 1.3 ఓవర్లు |
| 6 ఓవర్ల మ్యాచ్‌కు: | 1.5 ఓవర్లు |
| 10 ఓవర్ల మ్యాచ్‌కు: | 3.0 ఓవర్లు |
| 12 ఓవర్ల మ్యాచ్‌కు: | 3.4 ఓవర్లు |
| 16 ఓవర్ల మ్యాచ్‌కు: | 4.5 ఓవర్లు |

టెస్టుల్లో స్లో ఓవర్ రేట్‌కు 'స్టాప్ క్లాక్'తో చెక్

సుదీర్ఘ ఫార్మాట్ అయిన టెస్ట్ క్రికెట్‌లో జట్లు తరచూ స్లో ఓవర్ రేట్‌తో సమయాన్ని వృథా చేస్తున్నాయన్న విమర్శల నేపథ్యంలో ఐసీసీ కఠిన చర్యలు చేపట్టింది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఇప్పటికే విజయవంతమైన 'స్టాప్ క్లాక్' విధానాన్ని ఇప్పుడు టెస్టుల్లోనూ ప్రవేశపెట్టింది. 202527 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్ నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ఈ నిబంధన ప్రకారం ఒక ఓవర్ ముగిసిన తర్వాత ఫీల్డింగ్ జట్టు 60 సెకన్లలోపు తర్వాతి ఓవర్‌ను ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలి. మైదానంలో 0 నుంచి 60 వరకు లెక్కించే ఎలక్ట్రానిక్ క్లాక్‌ను ఏర్పాటు చేస్తారు. ''ప్రతి ఓవర్ పూర్తయిన 60 సెకన్లలోపు ఫీల్డింగ్ జట్టు తర్వాతి ఓవర్ ప్రారంభానికి సిద్ధంగా ఉండాలి'' అని ఐసీసీ తన ప్లేయింగ్ కండిషన్స్‌లో పేర్కొంది. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే ఫీల్డింగ్ జట్టుకు రెండుసార్లు హెచ్చరికలు జారీ చేస్తారు. మూడోసారి కూడా ఆలస్యం చేస్తే, బ్యాటింగ్ జట్టుకు 5 పరుగులు పెనాల్టీగా లభిస్తాయి. ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లు పూర్తయ్యాక ఈ హెచ్చరికలు రీసెట్ అవుతాయి. అంతేగాక బ్యాటర్లు ఉద్దేశపూర్వకంగా షార్ట్ రన్ తీస్తే, తర్వాతి బంతికి ఎవరు స్ట్రైక్ తీసుకోవాలో నిర్ణయించుకునే హక్కును ఫీల్డింగ్ కెప్టెన్‌కు కల్పించారు. గాలేలో శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య ప్రారంభమైన టెస్ట్ సిరీస్‌తో ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి.

# అన్న ఇంత బాగా చేస్తారనుకోలేదు..

: 'కన్నప్ప'పై మంచు మనోజ్ రివ్యూ



హైదరాబాద్: తన సోదరుడు, నటుడు మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటించిన 'కన్నప్ప'పై తన అభిప్రాయాన్ని తెలియజేశారు నటుడు మంచు మనోజ్ హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమ్యాక్స్‌లో సినిమా చూసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సినిమా చాలా బాగుందని చెప్పారు. ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ''సినిమా చాలా బాగుంది. నేను అనుకున్న దానికంటే వెయ్యి రెట్లు బాగా వచ్చింది. చివరి 20 నిమిషాలు అదిరిపోయింది. ప్రభాస్ వచ్చిన తర్వాత నుంచి సినిమా మరో స్థాయికి వెళ్తుంది. ప్రభాస్ యాక్టింగ్ అదిరింది. అన్న కూడా ఇంత బాగా చేస్తారని అస్సలు ఊహించలేదు. ఈ సినిమా ఘన విజయాన్ని అందుకోవాలని ప్రార్థిస్తున్నా. మీ శ్రమకు తగిన ఫలితం దక్కాలని, పెట్టిన డబ్బు రెట్టింపుగా తిరిగి రావాలని కోరుకుంటున్నా'' అని మనోజ్ తెలిపారు. సినిమాలోని కొన్ని సన్నివేశాలు తనను భావోద్వేగానికి గురిచేశాయన్నారు. తన తండ్రి మోహన్‌బాబు యాక్టింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మంచు విష్ణు కలల ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' రూపొందింది. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. శివ భక్తుడు కన్నప్ప జీవితాధారంగా దీనిని సిద్ధం చేశారు. తిన్నడు/కన్నప్పగా విష్ణు నటించగా రుద్రగా ప్రభాస్, కిరాతగా మోహన్‌లాల్, శివుడిగా అక్షయ్‌కుమార్, పార్వతిగా కాజల్ అగర్వాల్, మహదేవశాస్త్రిగా మోహన్‌బాబు నటించారు. ఎన్నో అంచనాల మధ్య ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది.





నిధి అగర్వాల్ తన అభిమానుల దృష్టిని తక్షణమే ఆకర్షించిన కొత్త చిత్రాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఫోటోలో, @gopivaid-designs రూపొందించిన ప్రకాశవంతమైన గులాబీ రంగు లెహంగాలో ఆమె చాలా అందంగా ఉంది,

## సినిమా

# ఏ ఒక్క హిట్టు పడ్డా..!



నటన, అభినయంతో కుర్రకారును కట్టిపడేస్తున్న మరాఠీ భామ భాగ్యశ్రీ బోర్సే కు ఒక్క హిట్టు పడ్డా ఇక నాన్ స్టాప్ గా దూసుకెళ్లడం పక్కా అంటున్నారు టాలీవుడ్ పండితులు. మోడల్ గా కెరీర్ ను ప్రారంభించింది ఈ పుణె నగరపు అందగత్తె. 2023లో యారియాన్ -1 అనే హిందీ సినిమాతో తెరంగేట్రం చేసింది. ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్, మాస్ మహారాజ్ రవితేజ కాంబినేషన్‌లో 2024లో విడుదలైన తెలుగు సినిమా మిస్టర్ బచ్చన్ లో కథానాయిక పాత్ర ఆమె పోషించి మెప్పించింది. శంకర్ ఇంట్రడ్యూస్ చేసే హీరోయిన్స్ కి అదేంటో బాగా కలిసి వస్తుంది. ఈ క్రమంలో మిస్టర్ బచ్చన్ ఫ్లాప్ అయినా కూడా భాగ్యానికి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం అమ్మడు కింగ్ డమ్, ఆంధ్రా కింగ్ తాలూకా, కాంతా సినిమాలు చేస్తుంది. ఈ సినిమాల్లో ఏ ఒక్కటి బ్లాక్ బస్టర్ పడ్డా అమ్మడిని ఆపడం ఎవరి వల్లా కాదు. ఇది చాలదు అన్నట్టుగా మరికొన్ని సినిమాలు వచ్చి యాడ్ అవుతున్నాయి. భాగ్య శ్రీ ఖాతాలో లేటెస్ట్ గా అక్కినేని అఖిల్ సినిమా లెనిన్‌లో నూ భాగ్యశ్రీ హీరోయిన్ అని తెలుస్తోంది. శ్రీలీల చేయాల్సిన ఆ సినిమా కాస్త ఆమెకు డేట్స్ అడ్జెస్ట్ అవ్వట్లేదని ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ కాగా ఆ ఛాన్స్ భాగ్య శ్రీ కొట్టేసింది. కింగ్ డం సినిమా నుంచి వచ్చిన సాంగ్ తో యూత్ ఆడియన్స్ కి దగ్గరైంది భాగ్య శ్రీ. చూస్తుంటే అమ్మడు టాలీవుడ్ లో కొన్నాళ్లు తన హవా కొనసాగించేలా ఉందనిపిస్తుంది. ఇక రిలీజ్ ల విషయానికి వస్తే భాగ్య శ్రీ నటించిన కింగ్ డమ్ నెక్స్ట మంత్ రిలీజ్ అవుతుంది. ఆంధ్రా కింగ్ తాలూకా కూడా త్వరలో రిలీజ్ కానుంది. ఈ రెండింటిలో ఏ ఒక్క హిట్టు పడ్డా ఈ అమ్మడు నాన్ స్టాప్ గా దూసుకెళ్లడం పక్కా..!

# జాక్ పాట్ మూవీ!

సీతారామం, హాయ్ నాన్న మూవీస్ హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ సూపర్ క్రేజ్ సంపాదించుకుంది మృణాల్ ఠాకూర్. కానీ ఆ తర్వాత ది ఫ్యామిలీ స్టార్ ఫ్లాప్ అవ్వడంతో ఈ అమ్మడుకు ఛాన్స్‌లు రాలేదు. విజయ్ దేవరకొండతో చేసిన ఆ మూవీలో మృణాల్ ఠాకూర్ తన పాత్ర వరకు ఆకట్టుకుంది. ఇక శృతి హాసన్ తప్పుకోవడంతో అడివి శేష్ నటిస్తున్న డెకాయిట్‌లో అవకాశం దక్కించుకుంది. తెలుగులో డెకాయిట్ తప్ప ఆమెకు మరో సినిమా లేదు. అది హిట్ పడితేనే మరో ఛాన్స్ వచ్చే పరిస్థితి ఏర్పడింది. డెకాయిట్ తర్వాత తెలుగులో సినిమాలేవైనా డిస్కషన్‌లో ఉన్నాయా అంటే లేదన్నట్టుగానే వార్తలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్‌లో తన మార్క్ సినిమాలు చేస్తూ వెళ్తున్నప్పటికీ.. ఈ అమ్మడికి టాలీవుడ్‌లో మాత్రం ఒక మంచి ఇమేజ్ ఏర్పడింది. కాబట్టి ఇక్కడ ఆఫర్లు రావాలంటే ఆమె ఇంకా ప్రభావం చూపాల్సి ఉంటుంది. కథల ఎంపికలో ఆచుతూచి వ్యవహరించాలి. అంటే ఆమెకు కచ్చితంగా మరో మంచి జాక్ పాట్ సినిమా కావాల్సిందే.



# ముద్దుగుమ్మల లవ్ ఫోజ్

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా రూపొందుతున్న 'తెలుసు కదా' మూవీలో శ్రీనిధిశెట్టి, రాశి ఖన్నాలు హీరోయిన్స్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. సాధారణంగా సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ ఉంటే కాంబో సీన్స్ చాలా తక్కువగా ఉంటాయి. కానీ ఇందులో మాత్రం వీరిద్దరి కాంబోలో చాలా సీన్స్ ఉంటాయని తెలుస్తోంది. ఇద్దరు ముద్దుగుమ్మల మధ్య నలిగిపోయే పాత్రలో సిద్ధు నవ్వులు పూయించే అవకాశాలు ఉన్నాయి. అక్టోబర్ 17న ఈ మూవీ విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కాస్ట్యూమ్స్ డైజనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ సినిమాను విభిన్నంగా ప్రమోట్ చేయాలి అనే ఉద్దేశంతో ఇప్పటికే మంచి కంటెంట్ వీడియోలను తయారు చేశారట. అందులో భాగంగానే సిద్ధు జొన్నలగడ్డ వీడియో కాల్ వీడియోను విడుదల చేశారు. తాజాగా శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నాలు లవ్ సింబల్‌ను పెట్టిన ఫొటోను షేర్ చేశారు. సాధారణంగా అమ్మాయి, అబ్బాయి లవ్ సింబల్‌ను రెండు చేతులతో ఏర్పాటు చేస్తే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కానీ హీరోయిన్స్ ఇద్దరూ లవ్ సింబల్‌ను పెట్టినా కూడా ఫొటో వైరల్ అవుతోంది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.